ఆంధ్రజ్యోతి

20 పేజీలు

సంగారెడ్డి



ఆదివారం 7 జనవరి 2018



నేడు సంక్రాంతి ముగ్గుల పోటీలు

- 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో పటాన్‌చెరులో నిర్వహణ
- ముఖ్యఅతిథులుగా హాజరవుతున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు


5



సేంద్రియ వరి నాటు విధానాన్ని రైతులకు వివరిస్తున్న అధికారులు

సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడి

4



రామచంద్రాపురంలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీశ్ రావు, పక్కన ఎంపీలు, కొత్త ప్రభాకర్ రెడ్డి, సింధూ ఆదర్శ రెడ్డి

అభివృద్ధిలో దేశంలోనే

తెలంగాణ రికార్డు

అసాధ్యాలను సుసాధ్యం చేస్తున్న సీఎం

- 4 నెలల్లో రాష్ట్రమంతటా తాగునీటి సరఫరా
- 14,500 మెగావాట్లతో ప్రజలకు 24 గంటల కరెంట్
- రూ.250 కోట్లతో హైదరాబాదులో మిషన్ కాకతీయ


5

వసతుల కల్పనలో దేశంలో తెలంగాణ రికార్డు సాధించింది. అసాధ్యాలను కూడా సీఎం కేసీఆర్ సుసాధ్యం చేస్తున్నారు. ఈ విధానాన్ని మెచ్చి ఇతర రాష్ట్రాల ప్రతినిధులు ఇక్కడికి వచ్చి పరిశీలిస్తున్నారు. 14,500 మెగావాట్ల విద్యుత్తుతో ప్రజలకు 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నాం. శాసనసభలో పెద్దలు జానారెడ్డి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తే విచిత్రమే అని అన్నారు. ఇప్పుడు ఆయన ఏం సమాధానం చెప్తారు. కేసీఆర్ చేస్తున్నది చిత్రమో విచిత్రమో పెద్దలు జానారెడ్డి చెప్పాలి. 3,4 నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటికీ తాగునీటిని అందిస్తా. రూ.250 కోట్లతో హైదరాబాదులోని చెరువులను అభివృద్ధి పరుస్తాం.

– మంత్రి హరీశ్ రావు



ఎంఐజీ బహిరంగసభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్ రావు



కందిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పీహెచ్‌సీల్లోనూ అల్ట్రాసౌండ్

- గర్భిణులకు తప్పనున్న స్కానింగ్ ఖర్చుల భారం
- లింగ నిర్ధారణకు అడ్డుకట్ట
- పేదలకు చేకూరనున్న ప్రయోజనం
- త్వరలో ఎంబీబీఎస్ వైద్యులకు శిక్షణ

5 లో





మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పటాన్‌చెరు పరిశ్రమలో అగ్నిప్రమాదం

- ఐదు లక్షల ఆస్తి బుగ్గిపాలు

3 లో

మంజీరవం

సాహిత్య క్షేత్రంలో అక్షరాల సాగు చేస్తున్న మిత్రులందరి కోసం ఈ పేజీ. కవితలు, వ్యాసాలు, సమీక్షలు, సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన పెద్దలను ఈ తరానికి పరిచయం చేసే రచనలు, మీ అభిప్రాయాలు ajmanjeeravam@gmail.comకు పంపగలరు.

పుస్తక పరిచయం



విశ్వనాదాలు

జీవితానుభవాల కవితా సంపుటి

హుస్నాబాద్, జనవరి 6: నిత్య జీవితానుభవాలను చూపుతూ వాటిలోని మంచిని ఎంచుకునే విధంగా వెలువడిన కవితల సమాహారం 'విశ్వనాదాలు'. సందేశంతో పాటే సామాజిక చైతన్యాన్ని కలిగించే సంకలనమిది. హుస్నాబాద్ పట్టణానికి చెందిన కవి, రచయిత, రిటైర్డు ఆంగ్ల ఉపాధ్యాయుడు కామారపు విశ్వనాథం దీని కర్త. 'ఎండుటాకులు ఏరుకుతినే పశువుకు పచ్చిగడ్డి దొరికిన నాడే పండుగ'... 'సముద్రపు నీరెంత సమృద్ధిగా ఉంటేనేం త్రాగడానికి తగని దైనప్పుడు' అంటూ జీవన స్థితిగతుల గురించి ప్రశ్నిస్తారాయన. విశ్వజీవన రాగాలు, అమృత వర్షిణి కవితా సంపుటాలు ఆయన ఇదివరకటి రచనలు.

ప్రతులకు : 17-103/1/1, టీచర్స్ కాలనీ, హుస్నాబాద్, జిల్లా : సిద్దిపేట
రచయిత సెల్ : 9849335230

కవిత్వం

పొరం

అక్షరాల పల్లకి బోయీలం
కలిసి గాల్లో నడుస్తున్నపుడు
బొమ్మల నిచ్చెనలేసే పొత్తు
నమ్మకం తట్టలు మోసినంతకాలం
మనంగా మారిన బస్సు ప్రయాణం
చిటికెన వేలు పట్టుకున్న
మొలకల్నే చేర్చాం ఇంటికి
మనం వనం కాలేకపోయాం
హవ్వల్ దర్జాగా గెట్లు పెట్టుకోలే

నా అక్షరాలను తాకట్టు పెట్టావు
నమ్మకం గోవర్ధనగిరి ఎత్తిన ఫోజు
కాళ్లకింది భూమి తవ్వేశావు
నాటుకున్నావు నీ కాళ్ల కింద
మోసం ధృతరాష్ట్ర కౌగిట్లో నేను
పగోనింట్ల ఇస్తరాకువు
మోపావు తలపై పాదం
గాల్లో జుట్టు ఎగరేసిన సంబరానివి
గాల్లో వేలాడుతూ నేను
గాలిబుడగ కాను పగిలిపోవడానికి

నేను అక్షరాలు నాటేసేవాన్ని
కవిత్వం పంటలు తీసేవాన్ని
కొనగోటిపై ఆత్మవిశ్వాసం
జీవమున్న వాన్ని
జీవించడం నేర్పిన వాన్ని
తుంచేశాననుకున్నావు కసితో
తలెత్తుకున్నా ఆకాశానికి
నివ్వెరపోవడం నీ వంతు
నిలదొక్కుకోవడం నా వంతు

– కొమురవెల్లి అంజయ్య
(మిత్రశత్రువుకు ప్రేమతో)

కూనలమ్మ పదాల పూదోట సిద్దిపేట

ఆరుద్ర స్ఫూర్తితో జిల్లాలో ఇద్దరు కవులు.. నాలుగు కూనలమ్మ పదాల పుస్తకాలు

సిద్దిపేట : తెలుగు సాహిత్యంలో పద్య, గద్య విభాగాలలో అనేక ప్రక్రియలున్నాయి. పద్య విభాగంలో ఛందోబద్ధ పద్యాలు, గేయ కవితలు, వచన కవితలు, పద కవితలు చెప్పుకోదగినవి. నాడు ఆరుద్ర ప్రారంభించిన కూనలమ్మ పదాలను కొనసాగించిన వారు చాలా తక్కువ. సిద్దిపేట జిల్లాలో ఐతా చంద్రయ్య, కటుకోజ్వల ఆనందంలు ఈ ప్రక్రియలో ప్రత్యేకతను చాటుకుంటూ రెండేసి పుస్తకాలు ప్రచురించారు.

కూనలమ్మ పదాల్లో నాలుగు పాదాలుంటాయి. మొదటి మూడు పాదాలలో పది మాత్రలు, నాల్గవపాదంలో 8 మాత్రలుంటాయి. మకుటం, అంత్యప్రాస గాని ఆది ప్రాసగాని ఉండాలి. అంత్య, ఆది ప్రాసలు కనీసం రెండు పాదాలలో ఉండాలి. ఈ ప్రక్రియలో తెలుగు సాహిత్యంలో 50లోపు పుస్తకాలు వెలువడ్డాయని అంచనా. అన్ని రకాల సాహిత్యాన్ని వడపోసిన సిద్దిపేట ప్రాంతంలో ఇద్దరు కవులు ఈ ప్రక్రియలో కూడా తమ ప్రావీణ్యాన్ని చాటి చెప్పారు. కవి, రచయిత, విమర్శకుడు, అనువాదకునిగా గుర్తింపు పొందిన ఐతా చంద్రయ్య 1990లోనే చందమామ పదాలు వెలువరించారు.





ఎన్నికలలో పొత్తు
ఎన్నికలలో చిత్తు
రాజకీయం మత్తు
ఓ చందమామ

అంటూ చందమామ పదాలలో నాటి రాజకీయ, సామాజిక నేపద్యంలో అనేక పదాలున్నాయి. తెలంగాణ మలి ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిన దశలో ఐతా చంద్రయ్య తెలంగాణ పదాలు వెలువరించారు.

తెలంగాణమానాడు
వెలుగుజిమ్మెను చూడు
విశ్వవీధుల నిండు
ఓ తెలంగాణ

అంటూ ఈ పదాలు వెలువరించారు. మలి తెలంగాణ ఉద్యమం ప్రారంభం నుంచి, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయేంత వరకు నేపథ్యంగా ఈ పదాలు హృద్యంగా ఆకట్టుకుంటాయి.


ఐతా చంద్రయ్య


కటుకోజ్వల ఆనందం



చిన్నకోడూరు మండలం చౌడారంకు చెందిన కటుకోజ్వల ఆనందం కూనలమ్మ పదాల నేపథ్యంలో రెండు పుస్తకాలు వెలువరించారు. ఈ రెండు భక్తి నేపథ్యంలో రచించినవే. శ్రీ అయ్యప్ప పదాల్లో

మర్మములు విడనాడి
ఖర్మములు నెడబాపి
ధర్మమును బోధించు

స్వామి అయ్యప్ప! అని కొనసాగుతాయి. సంతోషిమాత పదాలలో అమ్మవారి జన్మ వృత్తాంతాన్ని చాటిచెప్పారు.

మట్టి ఆలాపనల సుజాత

పరిచయం

- **సాహితీ కుటుంబంలో నుంచి వచ్చిన కుసుమం**
- **మూడు పుస్తకాల ప్రచురణ**



ఇవ్వాళ మట్టీ
కన్నీరు పెడుతుందా?
అవును!
మనుష్యుల కాలుష్యానికి

చంద్రుని మీంచి
తెచ్చిందేదో తెలుసా!
మణిమాణిక్యాలు కాదు
కేవలం మట్టి!

ఇన్ని తళతళల పట్నాన్ని వదిలి
ప్రతి ఉదయం నా మజిలీ స్వచ్ఛమైన పల్లెకు
హమ్మయ్య!
ఇప్పుడు హాయిగా ఊపిరాడుతుంది.

నాంపల్లి సుజాత కవిత్వానికి ఇవి మచ్చుతునకలు. కోహెడ మండలం సముద్రాల పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేసే నాంపల్లి సుజాత సాహిత్య వాతావరణంలో పెరిగి కవయిత్రిగా రూపుదిద్దుకున్నది. తండ్రి అన్నవరం దశరథం ఉపాధ్యాయుడు, చిత్రకారుడు. అన్న అన్నవరం దేవేందర్ సాహితీ ప్రపంచంలో చిర పరిచితుడు, తమ్ముడు శ్రీనివాస్ చిత్రకారుడు. హుస్నాబాద్ మండలం పోతారంలో జన్మించిన ఆమె. నాంపల్లి రాములుతో వివాహానంతరం హైదరాబాద్‌కు మారినా, తిరిగి వృత్తిరీత్యా సిద్దిపేట జిల్లాకు మారక తప్పలేదు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నా పల్లెటూరి మట్టి మనుషుల మధ్య ఉంటుండటంతో వారి జీవన విధానం, బాధలు, భావనలు కవిత్వంలో



చోటు చేసుకుంటాయి. ఆచార్య ఎన్.గోపి ప్రభావంతో నానీల ప్రక్రియను చేపట్టారామె. 2006లో నానీల సంపుటి 'నెమలీకలు', వెలువరించింది. అందులో ముఖ్యంగా ప్రపంచీకరణ ప్రభావంతో గ్రామీణ సంస్కృతి పతనమైపోతున్న దీనదృశ్యం, తారుమారవుతున్న విలువలు, నగరీకరణ ప్రభావం మొదలైనవి చోటు చేసుకున్నాయి. 2009లో 'మట్టి నా ఆలాపన' వచన కవితా సంపుటి వెలువరించారు. అందులో ఎర్రబస్సు, ఎనగర్ర, దస్తీ మొదలైనవన్నీ గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించేవే. 2015లో తిరిగి 'మట్టి నానీలు' అనే ఏక వస్తువుతో కవిత్వం వెలువరించింది. మానవ నాగరికతకే ఆనవాళ్లయిన మట్టి పాత్రలు నేడు గత స్మృతులుగా మారిపోతున్న తీరును అందులో వెల్లడించింది. ప్లాస్టిక్ ఆక్రమించిన తీరును ఆమె కళ్లకు కడ్తుంది.

మంత్రహస్తమిది
ఎన్ని కుండలో అతని చుట్టూ
ఇంట్లో మాత్రం
చిల్లి కుండ!

అంటూ సామాజిక చైతన్యాన్ని రంగరించి రచనలు చేస్తున్న సుజాత కలం నుంచి మరింత సాహిత్యం వెల్లివిరియాలని కోరుకుందాం.

– సిద్దిపేట

సమాజ హితాన్ని కాంక్షించేదే సాహిత్యం

ఇంటర్వ్యూ

డాక్టర్ చెప్పెల హరినాథశర్మ



సిద్దిపేట, జనవరి 6: సమాజ హితాన్ని కాంక్షించేదే సాహిత్యమని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి చెప్పెల హరినాథశర్మ చెప్పారు. శనివారం ఆంధ్రజ్యోతికిచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. కవిత్వంలో వాసి కన్నా రాసి ముఖ్యమని అన్నారు.

సాహిత్య ప్రయోజనం ఏమిటి?

సమాజ హితాన్ని కాంక్షించడమే సాహిత్య ప్రయోజనం. దేశ, కాల పరిస్థితులకు అనుగుణంగా సాహిత్య సృజన జరగాలి. కవిత, కథ, నవల ఇలా ప్రక్రియ ఏదైనా విశాల సామాజిక ప్రయోజనాలకు అనుగుణంగా ఆవిర్భవించాలి. వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో ఇలాంటి రచనలే చరిత్రలో నిలిచాయి.

సమకాలీన సాహిత్యం ప్రయోజనవంతంగా ఉందని భావిస్తున్నారా?

సమాజంలోని విభిన్న వర్గాల ప్రయోజనాల పరిరక్షణ ధ్యేయంగా వచ్చిన సాహిత్యం ఉద్యమస్ఫూర్తితో రావడం ఆధునిక యుగలక్షణంగా చెప్పవచ్చు. స్త్రీవాద, దళితవాద, మైనారిటీ వాద, ప్రాంతీయ అస్థిత్వవాద, జాతీయ వాద ధోరణులు ఇందుకు ఉదాహరణలు. ఆధునిక ధోరణుల్లో తెలంగాణ అస్థిత్వవాద సాహిత్యం విశేష ప్రభావం చూపింది.

పద్య, గేయ, వచన కవిత్వం.. వీటిలో ఏ ప్రక్రియ బలమైన ప్రభావాన్ని చూపిందంటారు?

ప్రక్రియ ఏదైనా అభివ్యక్తీకరణ ఎలా ఉంది? కవిత్వం పాలు ఎంత అనేదే ముఖ్యం. ఛందోబద్ధమైనదంతా కవిత్వం కాకపోవచ్చు. అదేవిధంగా అంత్యప్రాసలతోనో అనుప్రాసలతోనో వాక్యాలను విరిచో, వచనాన్ని పరిచో అదే వచన కవిత్వమనే భ్రమ కూడా మంచిది కాదు. ఈనాడు అధ్యయన శీలత తగ్గుతోంది. పర్యవసానంగా కవితా సంకలనాలు విరివిగా వస్తున్నా.. రాశి తప్ప వాసి పెరగడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

పట్టపగలే దుకాణంలో చోరీ



దొంగతనం చేసి బైక్‌పై పారిపోతున్న దొంగలు సీసీ కెమెరాల్లో రికార్డైన దృశ్యం

చేగుంట, జనవరి 6: పట్టపగలే దుకాణపు యజమానిని దృష్టి మరల్చి నగదు దొంగిలించి ఉడాయించిన సంఘటన మండల కేంద్రమైన చేగుంటలో చోటుచేసుకుంది. చేగుంట ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం చేగుంట ప్రధాన రహదారిలో మెడికల్ దుకాణం నడుపుతున్న ఐత రామలింగంను బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు దృష్టి మరల్చి రూ.54 వేలు ఎత్తుకెళ్లారు. గంట తర్వాత దుకాణంలో దొంగతనం జరిగిందని గమనించిన యజమానికి పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయగా సీసీ కెమరాల్లో రికార్డు అయిన దృశ్యాల ఆధారంగా ఇద్దరు దొంగలను గుర్తించి వివిధ పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

తూప్రాన్‌లో కూలిన గోడ

▸▸ కూలీకి గాయాలు

తూప్రాన్, జవనరి6: తూప్రాన్ పట్టణంలో ఓ పురాతన గోడ కూలి శనివారం పనులు చేస్తున్న ఓ కూలీ గాయపడ్డాడు. తూప్రాన్ పట్టణంలోని జెండా సమీపంలో ఓ పాత ఇంటికి మరమ్మతు పనులు చేస్తున్నారు. కూలీలు పనులు నిర్వహిస్తున్న సమయంలో గోడ ఒక్కసారిగా కూలిపోయింది. ఈ సంఘటనలో కూలీ పనులు చేస్తున్న తూప్రాన్‌లో నివాసముండే యాదగిరి (25) తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని 108 అంబులెన్స్‌లో హాస్పిటల్‌కు తరలించారు.

డొక్కు బస్సులతో పిల్లల ప్రాణాలతో చెలగాటం

- ఫిట్‌నెస్ లేని బస్సుల్లో పిల్లలను పాఠశాలకు చేరవేత
- పాఠశాల వివరాలు లేని ఎంఈవో కార్యాలయం
- ఆది నుంచి వివాదాస్పదంగా డాన్‌బాస్కో పాఠశాల తీరు



ప్రమాదానికి గురైన బస్సు లోపలి భాగం డొక్కు బస్సును తలపిస్తున్న దృశ్యం

కల్హేర్, జనవరి 6: నిత్యం పాఠశాలకు మూడు బస్సుల్లో పిల్లలను చేరవేస్తున్న ఒక్క బస్సు వివరాలు కూడా ఎంఈవో కార్యాలయంలో నమోదు కాలేదంటే ఆ పాఠశాల యాజమాన్యం పిల్లల ప్రాణాలతో ఎలా చెలగాటమాడుతుందో ఊహించుకోవచ్చు. ఉన్న బస్సుల నిర్వాహణ సక్రమంగా లేక పోవడం, అనుభవం లేని డ్రైవర్లు బస్సులు నడవడంతో ఆ పాఠశాలలో చదివే పిల్లల జీవితాలు గాలిలో దీపంలా మారాయి. శుక్రవారం డ్రైవర్ నిర్లక్ష్యంతో ముందు వెళ్తున్న లారీని బలంగా ఢీ కొట్టడంతో బాచేపల్లి సేయింట్ డాన్‌బాస్కో పాఠశాల విద్యార్థులు గాయపడిన విషయం విధితమే. జాతీయ రహదారి పక్కనే ఉన్న పాఠశాల భవన నిర్మాణానికి మొదట గ్రామ పంచాయతీ అనుమతి నిరాకరించింది. అయినా అధికారులను నయానో, భయానో ఒప్పించి అనుమతి పొందినప్పటికే నిత్యం జాతీయ రహదారిపై పిల్లలతో తిరిగే పాఠశాల బస్సుల ఫిట్‌నెస్ సక్రమంగా లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం ప్రమాదం జరిగిన బస్సు బ్రేకులు, స్టీరింగ్ రాడ్ ఊడిపోయాయి. అయితే బ్రేకులు లారీ ఢీ కొనడానికి ముందే ఫేయిల్ అయినాయా అనే అనుమానం వ్యక్తం అవుతుంది. 2016 సంవత్సరంలో ప్రారంభం అయిన ఈ పాఠశాలలో ఎవరైనా పిల్లల తల్లిదండ్రులు విద్యాబ్యాసం గురించి ప్రశ్నిస్తే యాజమాన్యం దురుసుగా సమాధానం ఇస్తారని వారు ఆరోపిస్తున్నారు. 30 మంది పిల్లలతో వెళ్తున్న బసు అతి జాగ్రత్తగా నడపాల్సిన డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పిల్లలను పాఠశాలలకు చేరవేసే బస్సులు, డ్రైవర్లు, ఫిట్‌నెస్ పై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ఈ పాఠశాలకు ఇతర చోట్ల బ్రాంచిలు కూడ ఉండడంతో బస్సులను అక్కడి నుంచి ఇక్కడికి, ఇక్కడి నుంచి అక్కడికి డొక్కు బస్సులను మార్చడం, ఒక పాఠశాల పేరున అనుమతి పొందినా ఇతర పాఠశాలకు మార్చడం వంటి చర్యలు చేస్తున్నా సంబందిత అధికారులు అటు వైపు చూడ లేదు. ఆ పాఠశాల అనుమతి బస్సుల ఫిట్‌నెస్ వంటి వివరాలు కల్హేర్ ఎమ్మార్సీలో లేక పోవడం గమనార్హం. అసలు జాతీయ రహదారి పక్కనే నిత్యం వందలాది వాహనాల మోతతో కొనసాగే ఈ పాఠశాలకు అనుమతి ఎలా ఇచ్చారో అర్థం కావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

పాఠశాలకు నోటీసులు జారీ చేశాం

– శంకర్, మండల విద్యాధికారి, కల్హేర్

శుక్రవారం డ్రైవర్ నిర్లక్ష్యంతో బస్సు ప్రమాదానికి గురై విద్యార్థులు గాయాలకు గురి కావడంతో పాఠశాలకు శుక్రవారమే నోటీసులు జారీ చేశాం. ఇందులో పాఠశాల అనుమతి బస్సుల ఫిట్‌నెస్ పొందిన వివరాలు బస్సుల అనుమతి పత్రాలతో కూడిన పూర్తి సమాచారంతో కార్యాలయంలో హాజరు కావాలని పాఠశాల యాజమాన్యానికి నోటీసులు పంపించాం. ఈ వివరాలన్ని డీఈవోకు నివేదించాం. శనివారం పాఠశాల యాజమాన్యానికి సంగారెడ్డి డీఈవో విజయకుమారి కూడా నోటీసులు జారీ చేసింది.

పాత కక్షలతో భార్యాభర్తలపై దాడి

- తీవ్ర గాయాల పాలైన బాధితులు



తీవ్ర గాయాలపాలైన బాధితురాలు సంతోష

సంగారెడ్డి రూరల్, జనవరి 6: పాత కక్షలతో భార్యా భర్తలపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన మోమిన్‌పేట్ మండలం ఎంకేపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నది. తీవ్రంగా గాయపడిన బాధితులను గ్రామస్థులు 108 అంబులెన్స్‌లో సంగారెడ్డి కేంద్ర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ఎంకేపల్లి గ్రామానికి చెందిన ఈడిగి చంద్రయ్య ఈ నెల 5న రాత్రి 7 గంటల ప్రాంతంలో తమను ఫోన్‌లో దూషిస్తూ దుర్భాషలాడారని, ఎందుకు తమను దుర్భాషలాడారని వారిని ప్రశ్నించగా తన భర్త వీరన్నను, చంద్రయ్య అతడి కుమారుడు వెంకటేశ్ కర్రలతో దాడి చేసి తీవ్రంగా కొట్టారని తెలిపారు. అడ్డుకున్న తనను కూడా తలపై కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. అరుపులు విన్న గ్రామస్థులు వచ్చేలోగా దాడిచేసిన వారు పారిపోయారని వెల్లడించారు. గ్రామస్థులు తమను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారని వివరించారు. అమానుషంగా తమపై దాడి చేసి గాయపరిచిన నిందితులను కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని బాధితులు భోరున విలపించారు. బాధితురాలి సోదరుడు శ్రీధర్‌గౌడ్ మోమిన్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

అల్లీపూర్‌లో విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



అల్లర్‌స్వామి మృతదేహం

జహీరాబాద్, జనవరి 6: జహీరాబాద్ మండలం అల్లీపూర్ గ్రామ శివారులో గల సంగమేశ్వర పుట్నాల మిల్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్న అల్లర్‌స్వామి(40) శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పది సంవత్సరాల కాలంగా మృతుడు పుట్నాల మిల్‌లో మిషన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడని పట్టణ ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు. మృతుడు తమిళనాడులోని తిర్చి జిల్లా, షేర్వారంపట్టి గ్రామానికి చెందినవాడన్నారు. విధుల నిర్వాహణలో భాగంగా శనివారం పనులు చేస్తుండగా ఎర్తింగ్ వైరుకు అల్లర్‌స్వామి తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు ఆయన తెలిపాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

పటాన్‌చెరు పరిశ్రమలో అగ్నిప్రమాదం

▸▸ రూ.5 లక్షల ఆస్తి బుగ్గిపాలు

పటాన్‌చెరు, జనవరి 6: పటాన్‌చెరు పారిశ్రామిక వాడలోని స్పిడ్జింగ్ స్టీల్ పరిశ్రమలో శనివారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఇందుకు సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పారిశ్రామిక వాడలోని పాత ఈఎస్‌ఐ డిస్పెన్సరీ వద్ద ఉన్న స్పిడ్జింగ్ స్టీల్ పరిశ్రమలో రాత్రి 8గంటల ప్రాంతంలో చిన్నపాటి మంటలు చెలరేగాయి. అక్కడే ఉన్న పరిశ్రమ సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేసి విఫలమయ్యారు. ఇంతరలో భారీ ఎత్తున మంటలు వ్యాపించాయి. పరిశ్రమలోని మిషన్లతో పాటు, ముడిసరుకు దగ్ధమైంది. మంటలు ఎగసిపడటం ప్రారంభమయ్యాయి. పటాన్‌చెరు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను ఆదుపులోకి తెచ్చారు. కాగా షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయని పరిశ్రమ యాజమాన్యం తెలిపింది. ఈ ప్రమాదంలో సుమారు ఐదు లక్షల రూపాయల విలువైన ఆస్తి నష్టం వాటిల్లింది. ప్రమాదంలో పరిశ్రమ కార్మికులు, సిబ్బంది ఎవరూ గాయపడలేదు.



పటాన్‌చెరులో అగ్నికి ఆహుతి అవుతున్న పరిశ్రమ

పెళ్లి చేసుకోవాలని యువతికి బెదిరింపులు

▸▸ ముగ్గురిపై కేసు నమోదు

కల్హేర్ , జనవరి 6 : పెళ్లి చేసుకోవాలని ఓ యువతిని బెదిరింపులకు గురి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సిర్గాపూర్ ఎస్‌ఐ మహేశ్ శనివారం తెలిపారు. సిర్గాపూర్ మండల వంగ్దాల్ రూప్లానాయక్ తండా యువతి రాథోడ్ అమనిని అదే తండాకు చెందిన మారుతి కొంత కాలం ప్రేమించుకున్నారు. ఇటీవలే ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. పెళ్లి చేసుకునేందుకు యువతి నిరాకరించింది. దీంతో మారుతి అన్న కొడుకులు మాణిక్, భక్షిరాం, భీంరావుకలసి యువతి ఆమని, ఆమే తండ్రి వసంత్‌ను చంపేస్తానని బెదిరింపులకు గురి చేశారు. దీంతో బాదితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయం సంగారెడ్డి జిల్లా

టెండర్ ప్రకటన

ఆర్.సి.నం. A2/58/2016 తేది: 06.01.2018

సంగారెడ్డి జిల్లా, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖలోని కళాశాల వసతి గృహములకు 2017-18 సంవత్సరమునకు గాను ఈ క్రింద చూపబడిన వారికి గాను టెండర్లు కోరబడుచున్నవి.

1. కుక్కింగ్, క్యాటరింగ్ కాంట్రాక్ట్
2. స్వీపింగ్ మరియు టాయిలెట్ క్లీనింగ్ కాంట్రాక్ట్
3. నైట్ వాచ్‌మెన్ సెక్యూరిటీ సర్వీసులు

టెండరు ఫారము వాటి యొక్క నియమ నిబంధనల కొరకై రూ.500/- డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా "జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయం, సంగారెడ్డి జిల్లా" పేరున చెల్లించి తేది 08.01.2018 నుండి 12.01.2018 వరకు ఉదయం 10.30 నిమిషాల నుండి మ.3.00 గంటల వరకు టెండరు ఫారాలను జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయం సంగారెడ్డి నుండి పొందవచ్చును. పూర్తిచేయబడిన టెండర్లు తేది 12.01.2018 సాయంత్రం 4.00 గంటల వరకు మాత్రమే స్వీకరించబడును. ఇట్టి సీల్డ్ టెండర్లు జిల్లా సంయుక్త కలెక్టర్/చైర్మన్ జిల్లా కొనుగోలు కమిటీ, సంగారెడ్డి జిల్లా గారి సమక్షంలో తేది 12.01.2018 నాడు సాయంత్రం 5.00 గం.లకు తెరువబడును.

సం/- సంయుక్త జిల్లా కలెక్టర్/చైర్మన్ తరపున జిల్లా కొనుగోలు కమిటీ సంగారెడ్డి జిల్లా

'కాకతీయ' నాల్గో విడత నిధులు మంజూరు

- జిల్లాలో 167 చెరువులకు రూ. 35.60 కోట్లు విడుదల
- రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు

సిద్దిపేట కల్చరల్, జనవరి6: సిద్దిపేట జిల్లాలో మిషన్ కాకతీయ నాల్గో దశ పనులకు రూ.35.60 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు మంత్రి హరీశ్‌రావు శనివారం తెలిపారు. దీనికి సంబంధించిన పరిపాలన అనుమతులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సిద్దిపేట (రూరల్, అర్బన్) మండలంలో 30 చెరువులకు రూ.6.52 కోట్లు, నంగునూరు మండలంలో 11 చెరువులకు రూ.1.83 కోట్లు, చిన్నకోడూరు మండలంలో 8 చెరువులకు రూ.3.02 కోట్లు, బెజ్జంకి మండలంలో 25 చెరువులకు రూ.4.36 కోట్లు, హుస్నాబాద్ నియోజకవర్గంలోని 29 చెరువులకు రూ.7.84 కోట్లు, దుబ్బాక నియోజకవర్గంలోని 36 చెరువులకు రూ. 6.26 కోట్లు, చేర్యాల, మద్దూరు మండలంలోని 28 చెరువులకు రూ.5.74 కోట్లు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

గజ్వేల్ వంద పడకల ఆసుపత్రిని పరిశీలించిన ఎంపీ



ఆసుపత్రిని పరిశీలిస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి, భూంరెడ్డి

గజ్వేల్, జనవరి 6 : గజ్వేల్ పట్టణంలోని వంద పడకల ఆసుపత్రిని శనివారం మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. ఆసుపత్రిలో జరుగుతున్న పనులను గూర్చి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, త్వరలోనే ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేయనున్న వసతులను గూర్చి ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట హౌసింగ్ కార్పొరేషన్ భూంరెడ్డి, జీపీఎస్పీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, వైస్‌చైర్‌పర్సన్ అరుణ, సీనియర్ నాయకులు డాక్టర్ యాదవ రెడ్డి తదితరులున్నారు.

'టీవీ కనెక్షన్ కట్ చేయాలి'

సిద్దిపేట రూరల్ : పదో తరగతి చదువుతున్న విద్యార్థులంతా ఇంట్లో టీవీ కనెక్షన్ కట్ చేయాలని, పిల్లల ఎదుట తగాదాలు పడకూడదని డీఈవో విజయ లక్ష్మి సూచించారు. శనివారం రాత్రి సిద్దిపేట మండలం తడ్కపల్లి గ్రామంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లను సందర్శించి పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. అందరి కృషితోనే పిల్లలు ఉన్నత స్థాయిలో స్థిరపడుతారన్నారు. గ్రామంలోని విద్యార్థులు సరోజన, కల్యాణి, సాయికృష్ణల ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులకు దండం పెట్టి చదివించాలని కోరారు.

సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడి

- రసాయన ఎరువుల వాడకంతో సారవంతం కోల్పోతున్న భూములు
- సంగారెడ్డి జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కరుణాకర్‌రెడ్డి

కల్హేర్, జనవరి 6: రైతులు తమ పంట భూముల్లో సేంద్రియ ఎరువులతోనే అన్ని రకాల పంటలు పండించాలని అప్పుడే అధిక దిగుబడి వస్తుందని సంగారెడ్డి జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి రైతుల కు సూచించారు. శనివారం మండల పరిధిలోని మార్డి గిరిజన తండాలో ఆత్మ సౌజన్యంతో వరి సాగు రైతులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ కరుణాకర్ మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడులు రావాలనే ఆశతో ఎక్కువ మొతాదులో రసాయన ఎరువులు వాడుతున్నారన్నారు. దీని మూలంగా భూములు సారవంతం కోల్పోవడంతో తీవ్ర నష్టం జరిగే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. తక్షణ ప్రయోజనం కోసం రైతులు భూములను నిర్లక్ష్యం చేస్తున్నారని ఇదే విధానం కొనసాగితే భవిష్యత్తులో పంటలు పడటం చాలా కష్టమని ఆయన అన్నారు. దీనిని నివారించడానికి వ్యవసాయ శాఖ అనేక రకాలుగా రైతులను అవగాహన కల్పించడం జరుగుతుందని చెప్పారు. దీని ఫలితంగా కొంత మంది రైతుల్లో మార్పు రావడం జరుగుతుందని కానీ అందరూ రైతులు సేంద్రియ ఎరువులనే వాడాలని సూచించారు. వెనుకటి పంటలకు జనుము, జింక్, పశువుల పేడ, వాడేవారని అన్నారు. ఇక నుంచి కూడా అధిక దిగుబడులకు ఆ ఎరువులను వాడాలన్నారు. జీవామృతం, వానపాములతో తయారు చేసిన సేంద్రియ వర్మి కాంపోస్టు ఎరువులను వాడాలని చెప్పారు. వీటితో పాటు వ్యవసాయ శాఖ పంపిణీ చేసే హరిత ఎరువులను రైతులు వినియోగించి పంటలు పండించాలన్నారు. దీంతో భూములు సారవంతాన్ని కోల్పోకుండా అధిక దిగుబడులు సాధించవచ్చునని పీడీ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. అనంతరం ఎంపీపీ అధ్యక్షురాలు జమునాబాయికి చెందిన ఒక ఎకరా పొలంలో వరి నాటును సేంద్రియ ఎరువులతో పండించడానికి ప్రదర్శన కోసం ఎంపిక చేయగా అందులో వరి నాటు వేసే పద్ధతిని రైతులకు వ్యవసాయ అధికారులు చూపించారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ ఆత్మ చైర్మన్ శ్రీరాం దిలీప్‌కుమార్, ఏడీఏ శ్రీనివాస్ ప్రసాద్, ఎంపీపీ అధ్యక్షురాలు జమునాబాయి, ఆత్మ డైరెక్టర్ హన్మంతరావు, ఏవో రాంప్రసాద్, బిటిఎం బాగ్య, ఏటీఎం మాధవీశ్రీలత, ఏఈవోలు భాస్కర్, సతీష్, మాజీ ఎంపీపీ మల్లేశం, మార్డి సర్పంచ్ చిత్తిబాయి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిష్టారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బహుజనుల పాలనతోనే బంగారు తెలంగాణ

- త్వరలో కొత్త పార్టీ
- తెలంగాణ రాష్ట్ర సామాజిక న్యాయం జేఏసీ అధ్యక్షుడు జస్టిస్ చంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

సంగారెడ్డి అర్బన్, జనవరి 6 : బహుజనుల పాలనతోనే బంగారు తెలంగాణ సాధ్య పడుతుందని తెలంగాణ రాష్ట్ర సామాజిక న్యాయం జేఏసీ అధ్యక్షుడు జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని ఐబీలో శనివారం 'సాహసం' రాష్ట్ర అధ్యక్షుడు ముప్పారం ప్రకాశ్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర సామాజిక న్యాయం జేఏసీ అధ్యక్షులు జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడారు. దేశాన్ని, రాష్ట్రాన్ని ఇప్పటీ వరకు పాలించిన పాలకులు సంపన్న వర్గాల ఏజెంట్లుగా ఉన్నందునే ప్రజల బతుకులు అగాధంలోకి నెట్టేయబడ్డాయన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజలు దుర్భరంగా బతుకుతున్నారని చెప్పారు. అభివృద్ధి పేరుతో తెలంగాణ సంపదను ఆంధ్ర కాంట్రాక్టర్లకు కట్టబెడుతూ సంపన్న ఏజెంటుగా కేసీఆర్ మారిపోయారన్నారు. రైతుల ఆత్మహత్యలు జరిగితే పట్టించుకోకుండా హేళనగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. యువతరానికి ఉద్యోగాలు ఇస్తామని మోసం చేస్తూ, హామీల పేరుతో కాలయాపన జరుగుతుందే తప్ప రాష్ట్రంలో ఎక్కడ అభివృద్ధి జరగడం లేదన్నారు. అందుకనే ప్రజల కోసం పనిచేసే కొత్త పార్టీని తెలంగాణ రాష్ట్రంలో త్వరలోనే ప్రకటించి బహుజనులను పాలకులను చేస్తామన్నారు. సమావేశంలో న్యాయవాది అలిగే సందీప్, మంటోల్ల రాములు, దశరథ్, హైమాద్, బంటు సుధాకర్, రమేష్, కృష్ణ, కొండగాల్ల సంజీవ్, కొండగాల్ల గణేష్, అనిల్, భాస్కర్, యాదగిరి, నర్సిములు, ఆందోల్ కృష్ణ, తదితరులున్నారు.

17న సదాశివపేటలో నిరుద్యోగ, రైతు గర్జన

- రైతులపై ప్రభుత్వం చిన్నచూపు
- టీజేఏసీ జిల్లా కన్వీనర్ బీరయ్య యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న టీజేఏసీ జిల్లా కన్వీనర్ బీరయ్య యాదవ్

సంగారెడ్డి అర్బన్, జనవరి 6 : రైతులు, నిరుద్యోగులపై చిన్న చూపు చూస్తున్న ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా ఈ నెల 17వ తేదీన సదాశివపేటలో నిరుద్యోగ, రైతు గర్జన నిర్వహిస్తున్నట్లు టీజేఏసీ జిల్లా కన్వీనర్ బీరయ్య యాదవ్ తెలిపారు. సంగారెడ్డిలోని నాల్గవ తరగతి ఉద్యోగుల భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలకు కేసీఆర్ పాల్పడుతున్నారని విమర్శించారు. నకిలీ విత్తనాలు నియంత్రించడంలో విఫలమయ్యారన్నారు. ఇటీవల రైతు అధ్యయన యాత్ర పేరిట టీజేఏసీ ప్రతి మండలంలోని గ్రామాలను పర్యటించి రైతులతో మాట్లాడడం జరిగిందన్నారు. పండించిన పంటలకు పెట్టుబడి రాక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆరోపించారు. గ్రామాల్లో రైతులు ఏ పంట వేయాలో చెప్పాల్సిన ఏవో, ఏఈవోలు రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం చేయూత ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల పాలిట కేసీఆర్ సర్కార్ శాపంగా మారిందన్నారు. ఇప్పటి వరకు 56 ఉద్యోగ ప్రకటనలు చేస్తే వాటిలో 16 నోటిఫికేషన్లకు మాత్రమే భర్తీ చేపట్టిందన్నారు. డీఎస్సీ విషయంలో ఏపీ ప్రభత్వాన్ని చూసి తెలంగాణ ప్రభుత్వం సిగ్గు తెచ్చుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్ర మెల్కొని పెదఎత్తున ఉద్యోగాల నియమకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. టీజేఏసీ జిల్లా కోఆర్డినేటర్ పల్పనూరి శేఖర్ మాట్లాడుతూ సదాశివపేటలో తలపెట్టిన నిరుద్యోగ, రైతు గర్జన బహిరంగ సభకు టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం, జిల్లా ఇన్‌చార్జి ప్రొఫెసర్ పురుషోత్తం, ప్రజాగాయకుడు ఎపూరి సోమన్నలు హాజరవుతారని తెలిపారు. డివిజన్ కన్వీనర్ పి.తుల్జారెడ్డి మాట్లాడుతూ టీజేఏసీ తలపెట్టిన బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో రైతులు, నిరుద్యోగులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో టీజేఏసీ సదాశివపేట పట్టణ చైర్మన్ పి.రాజు, సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు నగేశ్, సంగమేశ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయిలో మెరుగుపడాలి

- కేజీబీవీ, హైస్కూల్స్ పర్వాలేదు
- రాష్ట్ర బృందం తనిఖీల్లో వెలుగు చూసిన నిజాలు

సంగారెడ్డి అర్బన్, జనవరి 6 : పాఠశాలల్లో త్రీఆర్స్, ఎల్ఈపీ, అభ్యాసనాభివృద్ధి, సమగ్ర నిరంతర మూల్యాంకన విధానం అమలు తీరును పరిశీలించేందుకు జిల్లాలో విద్యాశాఖ రాష్ట్ర బృందాలు పర్యటించాయి. జిల్లాలోని 16 మండలాల్లో 36 పాఠశాలలు తనిఖీలు చేశారు. వాటిలో కేజీబీవీ, ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. అయితే రాష్ట్ర బృందాల తనిఖీలు శనివారం ముగిసాయి. బృందాలు తయారు చేసిన నివేదిక ఆధారంగా శనివారం సంగారెడ్డిలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించాయి. 9 మంది సభ్యులు సమీక్షలో పాల్గొన్నారు. వారిలో వేణు మాధవశర్మ, కమల్‌సింగ్, గోవర్ధన్, బసప్ప, విజయ్, శ్రీధరాచార్యులు, అవుసుల భానుప్రకాశ్, ఎస్.నర్సింహరావు, రవీందర్‌రెడ్డిలు ఉన్నాయి. జిల్లాలో తనిఖీ చేసిన ప్రాథమిక పాఠశాలల్లో త్రీఆర్స్, ఎల్ఈపీ, అభ్యాసనాభివృద్ధి, సమగ్ర నిరంతర మూల్యాంకన విధాన కార్యక్రమం వెనుకబడి ఉందని, అయితే వాటిని మెరుగు పర్చుకోవాలని డీఈవో విజయకుమారితో పాటు విద్యాశాఖాధికారులకు రాష్ట్ర బృందం సభ్యులు సూచించారు. కేజీబీవీ, ఉన్నత పాఠశాలల్లో త్రీఆర్స్, ఎల్ఈపీ, అభ్యాసనాభివృద్ధి, సమగ్ర నిరంతర మూల్యాంకన విధాన కార్యక్రమాల పనితీరు పర్వాలేదని సూచించారు. ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2, ప్రాజెక్టు రిపోర్టుల నమోదు బాగానే ఉందని సూచించారు. జిల్లాలో 40శాతం మెరుగుపడిందని సమీక్షలో చర్చించుకున్నారు. కొన్ని చోట్ల స్వల్ప మార్పులు ఉన్నాయని, వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు. సమీక్ష సమావేశంలో డీఈవో విజయకుమారి, నోడల్ ఆఫీసర్ లింబాజీ, సెక్టోరియల్ అధికారులు మంగిలాల్, ప్రశాంత్‌కుమార్, ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

'ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేయాలి'

సిద్దిపేట అర్బన్ జనవరి 06 : ఇసుక మాఫియాను అడ్డుకోవడంలో పోలీసుల చేతిలో చిత్రహింసలకు గురైన నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలని అక్రమంగా సాగుతున్న ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని టీ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలని శనివారం టీజేఏసీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సిద్దిపేట నుండి నేరెళ్ల వరకూ పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీస్ అంటే న్యాయం అడిగిన ప్రజలపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించడమేనన్నారు. రాజ్యాంగంలో అందరికీ సమాన హక్కులు ఉన్నాయని, తెలంగాణలో ప్రజలకు ఒక హక్కు, పోలీసులకు, ప్రజాప్రతినిధులకు మరో హక్కు ఉంటుందా అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ తన కంటూ ఒక ప్రత్యేక రాజ్యాంగాన్ని రాసుకున్నారన్నారు. ఇసుక మాఫియాకు ప్రభుత్వం వత్తాసు పలుకుతుందన్నారు. అడ్డుకున్న వారిని చిత్రహింసలకు గురి చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ప బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. సీపీఎం రాష్ట్రకార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ టీఆర్ఎస్ పాలన అత్యంత నిర్బంధంగా కొనసాగుతుందన్నారు. టీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే ఇసుక వ్యాపారం సాగుతోందన్నారు. సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ నేరెళ్ల ఘటనలో 35 మందిపై కేసులు పెట్టి ఎనిమిది మందిని అరెస్టు చేశారన్నారు.

అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణ రికార్డు

- అసాధ్యాలను సుసాధ్యం చేస్తున్న సీఎం
- 4 నెలల్లో రాష్ట్రమంతటా తాగునీటి సరఫరా
- 14,500 మెగావాట్లతో ప్రజలకు 24 గంటల కరెంట్
- రూ.250 కోట్లతో హైదరాబాదులో మిషన్ కాకతీయ



ఎంఐజీ బహిరంగసభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్ రావు, సభలో ఎంపీలు విశ్వేశ్వర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి

రామచంద్రాపురం, జనవరి 6 : వసతుల కల్పనలో దేశంలో తెలంగాణ రికార్డు సాధించిందని భారీనీటిపారుదల శాఖమంత్రి హరీశ్ రావు అన్నారు. అసాధ్యాలను సీఎం కేసీఆర్ సుసాధ్యం చేస్తున్న విధానాన్ని ఇతర రాష్ట్రాల ప్రతినిధులు వచ్చి రాష్ట్రంలో పరిశీలిస్తున్నారని చెప్పారు. శనివారం జీహెచ్ఎంసీ పరిధిలోని భారతీనగర్ డివిజన్‌లో రూ.11 కోట్లతో చేపడుతున్న పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను ఎంపీలు విశ్వేశ్వర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు మహిపాల్ రెడ్డి, అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి, కార్పొరేటర్లు సింధు ఆదర్శ రెడ్డి, అంజయ్య యాదవ్, జగదీశ్వర్ గౌడ్ తదితరులతో కలిసి మంత్రి హరీశ్ రావు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 14,500 మెగావాట్ల విద్యుత్తుతో ప్రజలకు 24 గంటలు విద్యుత్ సరఫరాను చేస్తున్నామన్నారు. శాసనసభలో పెద్దలు జానారెడ్డి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తే విచిత్రమే అని అన్నారని దీనికి మంత్రి సమాధానం చెప్పాలన్నారు. కేసీఆర్ చేస్తున్నది చిత్రమో విచిత్రమో పెద్దలు జానారెడ్డి చెప్పాలన్నారు. ముంబాయి, బెంగుళూరు పోలీసులు మన పోలీసుల పనితీరును పరిశీలించాయని చెప్పారు. 3,4 నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటికి తాగునీటిని అందిస్తామని చెప్పారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ హయాంలో రాష్ట్రంలో ఐటీ అభివృద్ధిచెందుతుందన్నారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు రావడంతో పాటు ఉద్యోగ అవకాశాలు అధికమయ్యాయని చెప్పారు. 250 కోట్ల రూపాయలతో హైదరాబాదులోని చెరువులను అభివృద్ధి పరుస్తామని చెప్పారు.

అభివృద్ధిపరచిన చెరు వులను కార్మికుల సొసైటీలకు అప్పగిస్తామన్నారు. ఇరిగేషన్ మున్సిపల్ శాఖలు చెరో సగం నిధులను సమకూరుస్తా మన్నారు. మన కూరగాయలు కేంద్రాల ఏర్పాటు ద్వారా ప్రజ లకు స్వచ్ఛమైన కూరగాయలు అందజేస్తున్నామన్నారు హైదరాబాద్ నగరంలో 50 మన కూరగాయల కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. మన కూరగాయల కేంద్రం ద్వారా రైతులకు వినియోగదారులకు లాభం చేకూరుతుందని చెప్పారు. సేంద్రియ ఎరువులతో సాగుచేస్తున్న ఉత్పత్తులను గుర్తించి, వ్యవసాయ ఉత్పత్తులకు సర్టిఫికెట్ జారీ చేస్తామని చెప్పారు. భారతీయ నగర్ కార్పొరేటర్ సిందూ ఆదర్శ్ రెడ్డి మహిళ అయినప్పటికిని అభివృద్ధిలో దూసుకుపోతుందని ఆమెను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ పుష్ప నగేష్, టీఆర్ఎస్ నాయకులు వి.ఆదర్శ రెడ్డి, గాలి అనిల్ కుమార్, మల్లెపల్లి సోమిరెడ్డి, టీవీ రావు, మోహన్ రెడ్డి, పరమేష్ యాదవ్, పాండు రంగారెడ్డి, కొలన్ బాల్ రెడ్డి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లోనూ అల్ట్రాసౌండ్ స్కానింగ్

- గర్భిణులకు తప్పనున్న స్కానింగ్ ఖర్చుల భారం
- లింగ నిర్ధారణకు అడ్డుకట్ట
- పేదలకు చేకూరనున్న ప్రయోజనం
- త్వరలో ఎంబీబీఎస్ వైద్యులకు శిక్షణ



సంగారెడ్డి ఆస్పత్రికి స్కానింగ్ కోసం వచ్చిన గర్భిణులు



అల్ట్రాసౌండ్ స్కానింగ్ గది

సంగారెడ్డి అర్బన్, జనవరి 6. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే గర్భిణులకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గర్భస్థ దశలోనే పిండం ఎదుగుదలను పరీక్షించేందుకు అవసరమైన అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరీక్షలు ప్రస్తుతం రేడియాలజిస్టులు, గైనకాలజిస్టులు మాత్రమే నిర్వహించేందుకు అర్హులు కాగా.. తాజాగా ఆస్పత్రుల్లోని ఎంబీబీఎస్ వైద్యులకు ఆరు నెలల పాటు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. శిక్షణ అనంతరం ధృవీకరణ పత్రాలు అందజేయాలని వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి రాజేశ్వర్‌తివారీ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే అల్ట్రాసౌండ్ స్కానింగ్ ద్వారా పరీక్షలు చేయడంతో లింగ నిర్ధారణ పరీక్షలకు చెక్ పడనుంది.

లింగ నిర్ధారణకు అడ్డుకట్ట

ఇప్పటి వరకు జిల్లా కేంద్ర ఆస్పత్రి, ఏరియా, కమ్యూనిటీ ఆస్పత్రుల్లోనే గర్భిణులకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ సదుపాయం ఉండడంతో గ్రామీణ ప్రాంత గర్భిణులు ఎక్కువగా ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లను ఆశ్రయించి పరీక్షలు చేయించుకొంటున్నారు. ఈ క్రమంలోనే లింగ నిర్ధారణ పరీక్షలు చేయిస్తూ భ్రూణహత్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే స్కానింగ్ సదుపాయాలు కల్పిస్తే లింగ నిర్ధారణ అక్రమాలను అడ్డుకట్ట వేయడంతోపాటు లింగ నిర్ధారణ చట్టాన్ని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు అనుసరించినట్లవుతుంది.

తప్పనున్న స్కానింగ్ ఖర్చులు

గర్భిణీలు పిండం ఎదుగుదలకు సంబంధించిన పరీక్షల కోసం చాలా వరకు ప్రైవేట్ స్కానింగ్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం అయ్యే వరకు మూడు నుంచి నాలుగు సార్లు పరీక్షలు చేయిస్తున్నారు. ఒక్కో పరీక్షకు రూ.400 నుంచి రూ.600 వరకు తీసుకుంటున్నారు. నాలుగు సార్లు పరీక్షలు చేయిస్తే దాదాపు రూ.2వేల వరకు ఖర్చు అవుతుంది. దీంతో గర్భిణులు ఎక్కువ సొమ్ము వెచ్చించడంతో పాటు వ్యయ ప్రయాసాలకు గురి కావాల్సి వస్తోంది. పీహెచ్‌సీల్లో వాటిని ఏర్పాటు చేయడంతో ప్రైవేట్‌కు వెళ్లకుండా పేద గర్భిణులకు స్కానింగ్ ఖర్చుల భారం తప్పే అవకాశముంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పీహెచ్ఎసీలలోనే పూర్తి స్థాయిలో నాణ్యమైన వైద్య సేవలు అందడంతో పాటు లింగ నిర్ధారణ వివక్షణకు చెక్ పెట్టే అవకాశముంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఈ నిర్ణయం ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

ఆరు నెలలు వైద్యులకు శిక్షణ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని ఎంబీబీఎస్ వైద్యులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్‌పై ఆరు నెలల పాటు త్వరలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. కేసీఆర్ కిట్‌తో పీహెచ్‌సీలకు వచ్చే గర్భిణుల సంఖ్య పెరగడంతో పాటు ప్రసవాలు కూడా భారీగా పెరిగాయి. కేసీఆర్ కిట్ ప్రారంభం అయిన నాటి నుంచి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకునేందుకు ఎక్కువగా చొరవ చూపడంతో తిరిగి స్కానింగ్ కోసం ప్రైవేట్‌కు వెళ్లకుండా ఆ యంత్రాన్ని ఆస్పత్రుల్లోనే ఏర్పాటు చేస్తే అక్కడ ఉండే వైద్యుడికి గర్భిణి ఆరోగ్యం గురించి వెంటనే తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఎంబీబీఎస్ వైద్యులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్‌పై ఆరు నెలల శిక్షణ ఇచ్చి వైద్య మండలిలో నమోదు చేయించి ఆ తర్వాత ధృవీకరణ పత్రాన్ని అందజేయనున్నారు. అయితే ప్రభుత్వం మహిళ ఎంబీబీఎస్ వైద్యులకు మాత్రమే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ముందస్తుగా 24 గంటలు పని చేసే పీహెచ్‌సీలకు మాత్రమే అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరికరాలు మంజూరు చేయనున్నట్లు తెలిసింది. జిల్లాలో 29 పీహెచ్‌సీలు ఉండగా అందులో 17 మాత్రమే 24 గంటలు పని చేసే పీహెచ్‌సీలున్నాయి. ఇక పీహెచ్‌సీల్లో అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరికరం ఏర్పాటుతో గర్భిణులకు వైద్యం మరింత చేరువకానుంది.

నిరుపేదలకు మేలు

– డాక్టర్ జి.గాయత్రీదేవీ, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో, డీఐవో



పీ హె చ్ సీ ల్లో అల్ట్రాసౌండ్ పరీక్షలు చేయడంతో మారుమూల నిరుపేదలకు మేలు జరుగుతుంది. ప్రైవేట్‌ను ఆశ్రయించి డబ్బులు ఖర్చు చేసుకునే బాధ తప్పుతుంది. పరికరం ఏర్పాటుతో పీహెచ్‌సీ స్థాయిలోనే ప్రసవాలు జరిగి సత్వర వైద్యం అందుతుంది. వైద్యులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్‌పై త్వరలో శిక్షణ ఇవ్వనున్నారు.

నేడు సంక్రాంతి ముగ్గుల పోటీలు

- పటాన్‌చెరులో 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీ నిర్వహణ
- ముఖ్యఅతిథులుగా హాజరవుతున్న ఎమ్మెల్యే,ఎమ్మెల్సీలు

పటాన్‌చెరు, జనవరి 6: 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో టాటా జెమినీ టీ సంక్రాంతి ముత్యాలముగ్గుల పోటీలు... టేస్ట్ పార్టనర్ గోల్డ్ డ్రాప్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సేల్, హెల్త్ పార్టనర్ అమృతబిందు ఆధ్వర్యంలో ఆదివారం పటాన్‌చెరు పట్టణంలో నిర్వహించనున్నారు. పోటీలకు నగదు బహుమతులను మండల పరిషత్తు అధ్యక్షుడు జి.శ్రీశైలంయాదవ్ స్పాన్సర్ చేస్తున్నారు. విజేతలకు బహుమతులను అందజేసేందుకు ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి, మెదక్ ఎమ్మెల్సీ వి.భూపాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. పటాన్‌చెరు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి. ముగ్గుల పోటీలో పాల్గొనదలచిన మహిళలు ఉదయం 10 గంటల లోపు ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని పేర్లను నమోదు చేసుకోవాలి. పోటీలు సరిగ్గా రెండు గంటల పాటు కొనసాగుతాయి. ప్రథమ విజేతకు రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, తృతీయ బహుమతిగా రూ.2వేల నగదును అందజేస్తారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యే అవకాశం ఉంది.

పోటీలో పాటించాల్సిన నిబంధనలు

- మహిళలు మాత్రమే పాల్గొనాలి
- ముగ్గులు, రంగులు, ఇరత సామగ్రిని ఎవరికి వారే వెంట తెచ్చుకోవాలి
- చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి
- ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు అనేవి చెప్పగలగాలి.
- ముగ్గు ఐడియా, డిజైన్‌కు 5మార్కులు, ముగ్గు అందానికి 15మార్కులు, మొత్తం 20 మార్కులు ఉంటాయి.
- ముగ్గను చేతితోనే వేయాలి. గొట్టాలు, బద్దలు ఉపయోస్తే వచ్చిన మార్కుల్లో నుంచి 3మార్కులు తొలగిస్తారు.
- ముగ్గులో గొబ్బెమ్మలు, బతుకమ్మలను అమర్చవచ్చు. అవి తప్ప ఇతరత్ర వస్తువులను ఎక్కువగా అమర్చకూడదు.
- ఇళ్ల నుంచి కలశాలు, ఇతర అందమైన వస్తువులను తెచ్చి అమర్చి వాటి చుట్టూ తూతూ మంత్రంగా ముగ్గు వేసే వారికి 3 మార్కులు తొలగిస్తారు.
- ఇక్కడ విజేతల ముగ్గులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యే అవకాశముంటుంది.

హాకీ మైదానంలో ఫుట్‌బాల్ టోర్నీ షురూ!

» ప్రారంభించిన ఎమ్మెల్యే

రామచంద్రాపురం, జనవరి 6: క్రీడలు శరీర దారుఢ్యానికి దోహదపడుతాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. భెల్ టౌన్‌షిప్‌లోని హాకీ మైదానంలో రెండు రోజుల పాటు జరిగే ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రీన్ సిటీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆర్థిక సహకారంతో ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న ఈ ఫుట్‌బాల్ పోటీల్లో మొత్తం 26 జట్లు పాల్గొంటున్నాయన్నారు. ఆదివారం టోర్నమెంట్ ముగింపు పోటీలుంటాయన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టోర్నమెంట్ నిర్వహణకు తన వంతు సహకారం అందిస్తున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యాదగిరి యాదవ్, జడ్పీటీసీ రాములు గౌడ్, కార్పొరేటర్ తొంట అంజయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పండుగలకు ప్రాధాన్యమిస్తుంది

కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా పండుగలకు ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్సీ వి.భూపాల్ రెడ్డి, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం తెల్లాపూర్ సర్పంచ్ మల్లెపల్లి సోమిరెడ్డి ఆధ్వర్యంలో తెల్లాపూర్, ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొని గెలుపొందిన వారికి వారు బహుమతులను అందజేశారు. త్వరలోనే తెల్లాపూర్ గ్రామానికి 323 సర్వే నంబరులో మైదానం కోసం స్థలాన్ని కేటాయిస్తామని చెప్పారు. విజేతలకు వారు 2.5 గ్రాముల బంగారం, మిక్సీ గ్రైండర్లను అందజేశారు. పోటీలో ప్రతి ఒక్కరికి సోమిరెడ్డి బహుమతిని అందజేశారు. ఆదివారం ఎంఐజీ కాలనీ, అంబేద్కర్ కాలనీల్లో ముగ్గుల పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యాదగిరియాదవ్, జడ్పీటీసీ రాములు గౌడ్, వైస్ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ మల్లెపల్లి బుచ్చిరెడ్డి, కార్పొరేటర్లు వి.సింధూఆదర్శరెడ్డి, అంజయ్యయాదవ్, ఏఎంసీ ఛైర్‌పర్సన్ పుష్ప, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బచ్చుగూడెం దర్గా అభివృద్ధికి కృషి

పటాన్‌చెరు, జనవరి 6: మండల పరిధిలోని బచ్చుగూడెం చౌరస్తా దర్గాను అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎంపీటీసీ అంతిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే దర్గాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఎంతో పురాతనమైన దర్గాకు పెద్ద ఎత్తున నిత్యం సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారని వారి సౌకర్యం కోసం దర్గా వద్ద మౌలికవసతులను అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలోనే దర్గా అభివృద్ధికి కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

'యువజన' అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

జిన్నారం, జనవరి 6: మండలంలో సామాజిక సేవ చేస్తున్న యువజన సంఘాలకు అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల యువజన సంఘాల సమితి అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. శనివారం జిన్నారంలో ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా రంగంలో కృషి, విద్య, వైద్య రంగాల్లో సహకారం అందిస్తున్న యువజన సంఘాలకు రాష్ట్ర కమిటీ అవార్డులను అందజేయనుందని, ఆసక్తి గల సంఘాలు వెంటనే మండల సంఘానికి దరఖాస్తులు అందజేయాలన్నారు.

'ఎన్‌సీఎల్ పరిశ్రమ'అధ్యక్షుడిగా

సత్యనారాయణ గౌడ్



హత్నూర, జనవరి 6: మండలంలోని తుర్కలఖానాపూర్ గ్రామ పంచాయతీలోని నాగార్జున సెక్యూలర్ లిమిటెడ్ (ఎన్‌సీఎల్) పరిశ్రమ కార్మిక సంఘం అధ్యక్షుడిగా సాదుల్లానగర్ గ్రామానికి చెందిన సత్యనారాయణగౌడ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా రాములు, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.భిక్షపతి, సహాయ కార్యదర్శిగా సీహెచ్. మల్లేశం, కోశాధికారులుగా టి.భాస్కర్‌గౌడ్, కె.శంకర్ తదితరులు ఎన్నికయ్యారు.

'విద్యారంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం'

జిన్నారం, జనవరి 6: జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మండల టీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో క్రీడా, విద్య పరికరాలను అందజేశారు. శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో టీఆర్ఎస్ జిల్లా యువత అధ్యక్షుడు వెంకటేశంగౌడ్, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తనయుడు విక్రమ్‌రెడ్డి విద్యార్థులకు క్రీడా సామగ్రి, విద్య పరికరాలు, వాటర్ టిన్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య రంగానికి అత్యంత ప్రాదాన్యమిస్తుందన్నారు. స్థానికంగా రూ.3 కోట్ల నిధులతో కళాశాలకు సొంత భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే కృషి మరువలేనిదని వెంకటేశంగౌడ్ అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణరెడ్డి, టీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ఉప సర్పంచ్ నీలం సంజీవ, ఆదర్శ్, నిఖిల్, భరత్, భాస్కర్, శ్రీకాంత్, సందీప్ పాల్గొన్నారు.

బొల్లారం పాఠశాలకు ఎస్పీ సంస్థ చేయూత

జిన్నారం, జనవరి 6: మండలంలోని బొల్లారం ప్రభుత్వ పాఠశాలలో నగరానికి చెందిన ఎస్పీ స్వచ్ఛంద సంస్థ రూ.2 లక్షల 40 వేలతో సేవా కర్యక్రమాలను నిర్వహించింది. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మరుగుదొడ్ల పునరుద్ధరణతో పాటు క్రీడాసామాగ్రి, ఆట వస్తువులను అందజేశారు. వేణుపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

» రెయిన్‌బో పాఠశాలలో సందడి



సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న చిన్నారులు

పటాన్‌చెరు, జనవరి 6: సంప్రదాయాలు, కళలకు పుట్టినిల్లు అయిన మన దేశ వారసత్వ సంపదను కళ్లకు కట్టినట్లు వివరించే కార్యక్రమాలను అమీన్‌పూర్ పంచాయతీ పరిధిలోని బీరంగూడా రెయిన్‌బో ఇంటర్‌నేషనల్ పాఠశాల చిన్నారులు ప్రదర్శించారు. శనివారం పాఠశాలలో సంస్కృతీ సమ్మేళన్ పేరుతో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. మన జాతీయ పండుగలు, సంగీతం, నాట్యరీతులు వివరిస్తూ చిన్నారులు ఆకట్టుకునే వేషధారణతో కనువిందు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ తోటకూర రాంబాబు, అకాడమిక్ డైరెక్టర్ అడుసుమిల్లి వసంత, ప్రిన్సిపాల్ సౌజన్య పాల్గొన్నారు.

సహకార సభ్యులు విధులు, బాధ్యతలపై అవగాహన

» హాజరైన టెస్కాబ్ ప్రిన్సిపాల్ భూక్యావెంకన్న

పుల్‌కల్, జనవరి 6: మండలంలోని ముదిమాణిక్యం పీఏసీఎస్‌లో సహకార సంఘం సభ్యులు, విధులు, బాధ్యతలపై శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా టెస్కాబ్ ప్రిన్సిపాల్ భూక్యా వెంకన్న హాజరయ్యారు. సొసైటీ అధ్యక్షుడు పి.రమేశ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ సభ్యుల అవసరాలు, సంఘ స్థోమత, వనరులు, వ్యాపార వ్యవహారాలపై అవగాహన కల్పించారు. అధికారులు, అర్హతలు, అనర్హతల గురించి వివరించారు. సహకార శాఖ విధి విధానాలు, ఆడిట్, అకౌంట్స్, సభ్యుల నిధులు, రుణాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో అసిస్టెంట్ రిజిస్ట్రార్ పోముసింగ్, ఇన్‌చార్జి సహకార విద్యాధికారి శ్యాంగంగాధర్‌రావు, ఎం.సంగమేశ్వర్, సీఈవోలు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా 16వ మహా పడిపూజ

» హాజరైన మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి, జగ్గారెడ్డి

రామచంద్రాపురం, జనవరి 6: కొల్లూరు గ్రామ ఉపసర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కె.రాజుగౌడ్ శనివారం నిర్వహించిన 16వ మహాపడి అంగరంగ వైభవంగా జరిగింది. అయ్యప్ప నామస్మరణతో గ్రామం మారుమోగింది. అరుణ్ గురుస్వామి, కేశవ్ గురుస్వామి, సుభాష్‌గౌడ్ ఆధ్వర్యంలో రాజుగౌడ్ ఇంటి నుంచి వాయిద్యాలతో స్వాములు ఊరేగింపుగా అయ్యప్ప ప్రతిమలను ఆభరణాలు, హారతితో వేదిక వద్దకు తీసుకువచ్చారు. వేలాది మంది భక్తులు స్వామియే శరణమయ్యప్ప ఉచ్చరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి, మాజీ విప్ తూర్పు జయప్రకాష్ రెడ్డి, గ్రంథాలయ మాజీ ఛైర్మన్ కిషన్, కార్పొరేటర్ శంకర్‌యాదవ్, కాట శ్రీనివాస్ గౌడ్, జడ్పీటీసీ ప్రభాకర్, మాజీ సర్పంచ్ బి.మల్లేశంగౌడ్, నాయకులు పి.శ్యాంరావు, జి.శ్రీనివాస్, మల్లేష్ తదితరులు అయ్యప్ప మండపంలో స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు.





రాజనర్సింహ, సునీతా లక్ష్మారెడ్డి, జగ్గారెడ్డిని ఆశీర్వదిస్తున్న గురుస్వామి, హాజరైన భక్తులు

శరవేగంగా కొనసాగుతున్న 'పంచాయతీ' పనులు



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాయకులు

గుమ్మడిదల, జనవరి 6: మండలంలోని దోమడుగు గ్రామంలో నూతనంగా చేపట్టిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి చేయూతను స్ఫూర్తిగా తీసుకున్న స్థానిక టీఆర్ఎస్ నాయకులు కొత్త హంగులతో నూతన పంచాయతీ భవన నిర్మాణాలను శరవేగంగా నిర్మిస్తున్నారు. మండలంలో మోడల్ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు గ్రామ కమిటీ అధ్యక్షుడు లింగం, స్థానిక సర్పంచ్ వెంకటేశం గ్రామస్థుల సహకారంతో పంచాయతీ భవనాన్ని నాణ్యత లోపించకుండా నిర్మింపజేస్తు న్నారు. ఈ పంచాయతీ భవన నిర్మాణ సలానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి 15 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. దీంతో ఆయన అందించిన స్ఫూర్తితో, పరిపాలన భవనం మోడల్‌గా సౌకర్యంగా ఉండాలన్న లక్ష్యంతో కాంట్రాక్టర్ లింగం నిర్మాణ పనులను చేపట్టారు. త్వరలోనే భవన నిర్మాణం పనులు పూర్తి కానున్నాయి. సంక్రాంతి పండుగ అనంతరం దోమడుగు గ్రామ పంచాయతీ నూతన భవనం ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నారు. శనివారం భవన నిర్మాణం పనులను దోమడుగు నాయకులు పరిశీలించారు.

'టీఆర్ఎస్ హయాంలోనే మత్స్యకారులకు పెద్ద పీట'

గుమ్మడిదల, జనవరి 6: టీఆర్ఎస్ ప్రభుత్వం మత్స్యకారులకు పెద్దపీట వేసి అభివృద్ధి పథంలో తీసుకొచ్చిందని ఆత్మకమిటీ ఛైర్మన్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామంలో మత్స్య సహకార సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కుమార్‌గౌడ్ మాట్లాడుతూ మత్స్యకారులను గతంలో ఏ ప్రభుత్వాలు కూడా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మత్స్యకారులను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలు అందేవిధంగా ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి నాయకత్వంలో మత్స్యకారులకు ప్రభుత్వ పథకాల ద్వారా సబ్సిడీతో ఎన్నో సంఘాలకు చేప పిల్లలు అందించి వారి జీవనాధారం చూపించిందన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ బలిజ మంగ, ఉప సర్పంచ్ ప్రశాంత్, ఎంపీటీసీ మంజుల, నాయకులు రామప్ప, సత్తయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కుమార్‌గౌడ్

అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా 'పేట'ను తీర్చిదిద్దుతా

» గత కాంగ్రెస్ పాలనలో ఒరగ బెట్టిందేమీలేదు
» ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, జనవరి 6: అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా సదాశివపేట మున్సిపల్ పట్టణాన్ని తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. శనివారం పట్టణంలోని 19 వార్డులో రూ.12 లక్షల నిధులతో కొత్తగా నిర్మించే సీసీ మురుగు కాలువల పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. వార్డు కౌన్సిలర్ చీల స్వరూప మల్లన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్ల కాంగ్రెస్ పాలనలో సదాశివపేటకు ఒరిగిందేమీ లేదన్నారు. పట్టణానికి చెందిన తాను ఇక్కడి ప్రజల నిండు ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా మూడేళ్లలో పట్టణాభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేయించానన్నారు. రూ.5.36 కోట్లతో పట్టణంలోని ఊబచెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా సుందరీకరిస్తున్నామన్నారు. రూ.1.28 కోట్లతో కొత్తగా బస్టాండ్‌ను నిర్మిస్తున్నామన్నారు. రూ.2.60 కోట్లతో మినీ స్టేడియం, స్విమ్మింగ్‌పూల్‌ను నిర్మిస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో ప్రజలకు జవాబుదారిగా ఉంటూ వారి ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకెళ్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ పట్నం విజయలక్ష్మి, వైస్‌చైర్మన్ విశ్వనాథం, తహసీల్దార్ అనిల్, కమిషనర్ ఇసాక్ అబ్‌ఖాన్, పట్టణ, మండల టీఆర్ఎస్ అధ్యక్షులు క్రిష్ణ, గడీల సుధీర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ అక్బర్‌హుస్సేన్, మాజీ కౌన్సిలర్ మక్సూద్, టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల చిన్న, చీలమల్లన్న, పట్నం సుభాష్ పాల్గొన్నారు.


సదాశివపేటలో సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కాల్స్‌బర్గ్‌లో టీఆర్టీయూసీ జెండావిష్కరణను చేసిన ఎమ్మెల్సీ రాములు నాయక్

కొండాపూర్, జనవరి 6: మండల పరిధిలోని మల్లేపల్లి గ్రామ శివారులో ఉన్న కాల్స్‌బర్ బీర్ ఫ్యాక్టరీలో శనివారం ఎమ్మెల్సీ రాములు నాయక్ టీఆర్టీయూసీ యూనియన్ జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రాములు నాయక్ మాట్లాడుతూ కార్మికుల హక్కులు, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రాంసింగ్ నాయక్, జైపాల్ నాయక్, రాజేందర్, నాయకులు నరేందర్, శ్రీనివాస్, సురేందర్, ప్రవీణ్, లక్ష్మణ్, ఉదయ్, గిరి, అమరేందర్ రెడ్డి, మురళి పాల్గొన్నారు.

అయుత ధర్మ దీక్షకు టీపీటీఎఫ్ మద్దతు

సంగారెడ్డి అర్బన్, జనవరి 6: గజ్వేల్‌లో 7న(ఆదివారం) తలపెట్టిన అయుత ధర్మదీక్షకు టీపీటీఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సంజీవయ్య, సోమశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డి మాండ్ చేస్తూ చేపట్టిన దీక్షకు ఉపాధ్యాయులు భారీగా తరలి రావాలని వారు కోరారు.

10న వ్యాయామ ఉపాధ్యాయులకు ఆన్‌డ్యూటీ

సంగారెడ్డి అర్బన్, జనవరి 6: కొల్లూర్‌లోని సమిష్టి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ నెల 10 నుంచి 13 వరకు 63వ జాతీయ కరాటే టోర్నమెంట్ నిర్వహిస్తున్నందున జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులకు ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించినట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మధుసూదన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

రాజీవ్ గృహకల్ప లబ్ధిదారులను పట్టించుకోరా?

» అప్పుల పాలైన పేదలు
» 9ఏళ్లుగా ఇళ్ల కోసం నిరీక్షిస్తున్నాం
» 15వ తేదీ తరువాత కబ్జా చేస్తాం
» టీమాస్ ఫోరం జిల్లా చైర్మన్ అనంతయ్య

సంగారెడ్డి రూరల్, జనవరి 6: రాజీవ్ గృహకల్ప లబ్ధిదారులు తమకు న్యాయం చేయాలని కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని టీమాస్ ఫోరం జిల్లా చైర్మన్ అనంతయ్య విమర్శించారు. సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని రాజీవ్ గృహకల్ప గృహాల వద్ద టీమాస్ అధ్వర్యంలో శనివారం వంటావార్పు చేసి లబ్ధిదారులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గృహలను నిర్మించి ఇచ్చేందుకు లబ్ధిదారుల వద్ద రూ.49వేలు వసూలు చేసి నిర్మించినా ఇంతవరకు లబ్ధిదారులకు ఇవ్వకుండా మొండి చేయి చూపారని విమర్శించారు. తమకు సొంతింటి కల సాకారం అవుతుందని ఆశించిన లబ్ధిదారులు అప్పులు చేసి, బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి కిస్తులు కట్టి అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిదేళ్లుగా ఇళ్లకోసం నిరీక్షణ చేస్తున్నా వారి ఆశలు అడియాశలవుతున్నాయన్నారు. తమకు ఇళ్లు ఇప్పించాలని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలకు విన్నవించినా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. గత ప్రభుత్వం నిర్మించిన గృహాలకు తమకు సంబంధం లేదని ప్రస్తుత టీఆర్ఎస్ సర్కార్ అనడం తగదని హితవు పలికారు. గత ప్రభుత్వ పెద్దలు చేసిన తప్పులను సరిదిద్ది పేదలకు న్యాయం చేయాల్సిన బాధ్యత మీ పై ఉంటుందని గుర్తు చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మాణిక్యరాజ్ కన్నన్, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ స్పందించి సంక్రాంతి పండుగలోగా లబ్ధిదారులకు ఇళ్లు ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ నెల 15వ తేదీ తరువాత టీమాస్ ఫోరం అధ్వర్యంలో లబ్ధిదారులతో కలిసి గృహాలను కబ్జా చేసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీమాస్ పట్టణ చైర్మన్ మల్లయ్య, కన్వీనర్ మల్లీశ్వరి, మహబూబ్‌ఖాన్, యాదవరెడ్డి, నాయకులు షబ్బీర్, చంద్రమౌళి, రాములు, మంజుల, విజయకళ, జాకీర్‌అలీ, వాజీద్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.


సంగారెడ్డి బైపాస్ రోడ్డులో వంటావార్పు చేసి నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

'జాబ్‌మేళాలను వినియోగించుకోవాలి'


ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులు

సంగారెడ్డి అర్బన్, జనవరి 6: జాబ్‌మేళాలను నిరుద్యోగులు వినియోగించుకోవాలని డీఆర్డీవో ఏపీడీ సిద్దారెడ్డి సూచించారు. సంగారెడ్డిలోని పాత డీఆర్డీవో కార్యాలయంలో శనివారం నిపాన్ ప్రైవేట్ సంస్థ నిర్వహించిన ఇంటర్వ్యూల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా నిర్వహించే జాబ్‌మేళాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు పొందాలని కోరారు. శనివారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 104 మంది హాజరు కాగా అందులో 38 మంది ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎం మోహన్, జేడీఎం శివకుమార్, డీపీ ఎజాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు: సీఐ

కొండాపూర్, జనవరి 6: కొండాపూర్ సర్కిల్ పరిధిలో ప్రమాదాలను నివారించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సీఐ రవి తెలిపారు. శనివారం కొండాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దొంగతనాలు జరగకుండా ప్రతి గ్రామంలోని కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మద్యం సేవించి, లైసెన్సులు, హెల్మెట్లు లేకుండా వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఆన్‌లైన్ మోసాలు అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను ముందుకు సాగించాలన్నారు. ఇంటికి తాళం వేసి వెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

'విధులకు హాజరు కాని టీచర్లపై చర్యలకు డిమాండ్'


డీఈవో విజయకుమారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

సంగారెడ్డి అర్బన్, జనవరి 6: జిల్లాలోని కొన్ని మండలాల్లో పాఠశాలలకు హాజరు కాని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం డీఈవో విజయకుమారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి ఎన్.అశోక్ మాట్లాడుతూ జహీరాబాద్, ఝరాసంగం, న్యాల్‌కల్‌తో పాటు పలు మండలాల్లో గతంలో ఎంఆర్పీలుగా పని చేసిన ఉపాధ్యాయులు సంవత్సరాల తరబడి పాఠశాల విధులకు హాజరు కాకుండా ఎంఆర్సీలోనే పని చేస్తున్నారన్నారు. ఈ విషయమై ఎంఈవోల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఇందులో కొంతమంది ఉపాధ్యాయులు కార్యాలయంలో పని అంటూ పాఠశాల విధులకు హాజరు కావడం లేదని, ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఈవోకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంపుమేశ్వర్, శ్రీకాంత్, విజయ్, ప్రియాంక, సింధు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇర్ఫానీ దర్గా ఉత్సవాలు

»పట్టణంలోని ప్రధాన వీధుల్లో గంధం ఊరేగింపు »భారీగా హాజరైన భక్తులు

సంగారెడ్డి రూరల్, జనవరి 6: మౌలానా అల్‌హజ్ హబీబ్ అహ్మద్ బిన్ ఉమర్ ఇర్ఫానీ అలీ షా బందనవాజి ఇర్ఫానీ దర్గా 15వ ఉర్సు ఉత్సవాలు ఈ నెల 6, 7 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలను శనివారం దర్గా పీఠాధిపతి హకీమ్ ఉమర్‌బిన్ అహ్మద్ ప్రారంభించారు. మొదటి రోజు ఈ నెల 6వ తేదిన దర్గా నుంచి పట్టణంలోని జామియా మసీదు జిల్లా పాత జైలు వద్ద నుంచి సంగారెడ్డి పట్టణంలోని ప్రధాన రహదారుల మీదుగా గంధం ఊరేగింపు దర్గాకు తీసుకువచ్చారు. రాత్రి ప్రముఖ కవులు మజిద్ దేవ్ బంది, మీసం గోపాలాచారి, జలాల్ షైకాష్, అక్బర్ తాజ్, జమీల్‌సాహి, ఫిరోజ్ రషీద్, మహ్మద్ జాహిద్, ఫయాజ్ అలి సికిందర్, సాబేర్ అహ్మద్ సారథ్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ దర్గా ఉర్సు ఉత్సవాల్లో కులమతాలకతీతంగా హిందూ, ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఇర్ఫానీ దర్గా ఉర్సు ఉత్సవాలకు సంగారెడ్డి చుట్టు పక్కల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు మహారాష్ట్ర, కర్ణాటక, నాందేడ్, బీదర్, బస్మత్, పర్బని, నిజామాబాద్, అదిలాబాద్, మెదక్, సిద్దిపేట, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు హాజరై ప్రార్థనలు చేసి తమ కుటుంబాల్లో సుఖ శాంతులు కలిగించు బాబా అని మొక్కుకున్నారు.


సంగారెడ్డి పట్టణంలోని పెద్ద మసీదు మీదుగా గంధం ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

'మరుగుదొడ్లను వినియోగించుకోవాలి'

జోగిపేట రూరల్, జనవరి 6: మరుగుదొడ్లు నిర్మించుకున్న కుటుంబాలు తప్పనిసరిగా వాటిని వినియోగించుకోవాలని స్వచ్ఛ భారత్ మిషన్ బృందం సభ్యులు సూచించారు. శనివారం కన్‌సాన్‌పల్లి, సంగుపేట గ్రామాల్లో ఈ అధికారుల బృందం పర్యటించింది. ఇప్పటి వరకు లబ్ధిదారులు నిర్మించుకున్న మరుగుదొడ్లు ఉపయోగంలో ఉన్నాయా లేదా అన్న విషయాలపై వారు ఆరా తీశారు. అలాగే నిర్మాణంలో ఉన్న వాటిని కూడా అధికారులు తనిఖీలు చేసి పరిశీలించారు.

టీమాస్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి

సదాశివపేట రూరల్, జనవరి 6: సదాశివపేట మండలంలో పరిశ్రమల నుంచి కాలుష్యం వెదజల్లుతూ పంటలను నాశనం చేస్తున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం టీమాస్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ అనిల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టీమాస్ సంగారెడ్డి జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు జయరాజ్ మాట్లాడుతూ మండల పరిధిలోని గాయత్రి స్టార్ కం, వెంకటరమణ పేపర్ మిల్లులు వదులుతున్న కాలుష్యం ద్వారా రైతులు పంటలను తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కాలుష్య కారక పరిశ్రమలపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మళ్లీ తప్పని నగదు తిప్పలు



'ఖేడ్'లో మూతపడిన ఏటీఎం

▸▸ నగదు కోసం విలవిల లాడుతున్న ఖాతాదారులు

నారాయణఖేడ్, జనవరి 6: నగదు కోసం ఖాతాదారులకు మళ్లీ తిప్పలు తప్పడం లేదు. కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్లను రద్దు చేసిన అనంతరం నగదు కోసం ఖాతాదారులు, జనాలు పడరాని పాట్లు పడినప్పటికీ అనంతరం బ్యాంకుల్లో నగదు నిల్వలు పెంచడంతో ఇబ్బందులు తప్పినప్పటికీ గత వారం రోజులుగా మళ్లీ నగదు నిల్వలు లేక ఖాతాదారులకు తిప్పలు తప్పడం లేదు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో ప్రధాన బ్యాంకులకు సంబంధించి నాలుగు ఏటీఎంలు ఉన్నప్పటికీ ఎప్పుడు ఒక్క ఏటీఎంలో కూడా నగదు నిల్వ ఉండటం లేదు. ప్రధాన బ్యాంకు శాఖలైన ఎస్‌బీఐ, ఆంధ్రాబ్యాంకు ఆవరణలో ఉన్న ఏటీఎంలో మాత్రం నగదు నిల్వలు అందుబాటులో ఉంటున్నాయి. ప్రస్తుతం నగదు కొరతతో అక్కడ కూడా ఏటీఎంలో డబ్బులు ఖాతాదారులకు అవసరాలకు అనుగుణంగా ఉంచడం లేదు. దీనికి తోడు నేరుగా ఖాతాల్లోంచి డబ్బులు తీసుకుందామంటే వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఇవ్వడం లేదు. దీంతో ఖాతాదారులు అత్యవసర పరిస్థితుల్లో నగదు కోసం పడరాని పాట్లు పడుతున్నారు. పట్టణంలో నాలుగు ఏటీఎంలు ఉన్నప్పటికీ నగదు లేక అవి ఎప్పుడు మూసి ఉంటున్నాయి.

ప్రధాన బ్యాంకుల్లో మాత్రం ఖాతాదారులకు కొద్దికొద్దిగా డబ్బులు ఇస్తున్నారు. ఏదిఏమైనా నగదు కొరతకు తోడు ఏటీఎంలు మూత పడడంతో ఖాతాదారులకు డబ్బులు అందక పోవడంతో మళ్లీ నగదు కోసం పడరాని పాట్లు పడుతున్నారు. అందువల్ల అధికారులు స్పందించి ఖాతాదారుల అవసరాలకు అనుగుణంగా నగదు చెల్లించడంతో పాటు ఏటీఎంలలో ఎప్పుడు నగదు అందుబాటులో ఉంచాలని పలువురు కోరుతున్నారు.

డబ్బులు లేక అవస్థలకు గురవుతున్నాం



పట్టణంలో ఉన్న ఏ ఏటీఎంలోను నగదు నిల్వలు లేవని దీంతో తమ అవసరానికి డబ్బులు పొందలేక పోతున్నాము. నా ఖాతాలో డబ్బులు ఉన్న అవసరానికి పొందలేక పోతున్నాను.

– సుజిత్‌కుమార్, ఖాతాదారుడు

ఒక్క కొడుకున్న తల్లిదండ్రులతో కిటకిటలాడిన హనుమాన్ ఆలయాలు

నారాయణఖేడ్, జనవరి 6: ఒక్క కొడుకు ఉన్న తల్లిదండ్రులు శనివారం హనుమంతుడికి పూజించి కొబ్బరి కాయను సమర్పించాలని లేని పక్షంలో అరిష్టమని పుకార్లు వ్యాపించడంతో శనివారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ప్రాంతంలోని హనుమాన్ ఆలయాలన్నీ ఒక్క కుమారుడు ఉన్న తల్లిదండ్రులతో కిటకిటలాడాయి. ప్రస్తుతం పుష్య మాసం కావడంతో ఒక్క కొడుకు ఉన్న వారికి గోచార ఫలాలు ఆశాజనకంగా లేవని అందువల్ల వారి క్షేమం కోసం తల్లులు శనివారం రోజున హనుమాన్ దేవాలయానికి వెళ్లి కొబ్బరి కాయను సమర్పించి ఉపవాసం ఉండాలని ప్రచారం సాగడంతో ఉదయం నుంచే మహిళలు వారి భర్తలను వెంట తీసుకొని హనుమాన్ ఆలయాలకు వెళ్లారు. దీంతో నారాయణఖేడ్ ప్రాంతంలోని హనుమాన్ ఆలయాలన్నీ భక్తులతో పోటెత్తాయి. కొబ్బరి కాయలకు కూడా భారీగా డిమాండ్ ఏర్పడింది. మరి కొందరు ఎంత మంది కొడుకులు ఉంటే అన్ని కొబ్బరి కాయలు సమర్పించుకున్నారు. కాగా కొండాపూర్ హనుమాన్ దేవాలయంలో రద్దీ మరింత అధికంగా ఉంది. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ ఆశీర్వచనాలు అందించారు.

రామాలయం పునర్నిర్మాణ పనులను పరిశీలించిన నగేశ్ షెట్కార్

నారాయణఖేడ్, జనవరి 6: నారాయణఖేడ్ పట్టణంలోని చారిత్రాత్మకమైన రామాలయ పునర్నిర్మాణం పనులను శనివారం జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యుడు నగేశ్ షెట్కార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణఖేడ్‌లోని రామాలయానికి ఘనమైన చరిత్ర ఉందని అందువల్ల ఆలయాన్ని అత్యంత ఆధునికంగా నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు ఆయన ఆలయం నమూనాను పరిశీలించారు. ఆలయం జీర్ణోద్ధరణ కావడంతో భక్తుల సహకారంతో పునర్నిర్మాణం పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన నమూనాను రూపొందించిన సాంకేతిక నిపుణుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆలయ కమిటీ చైర్మన్ నర్సింలు, ముత్యం హన్మండ్లు, సాంకేతిక నిపుణుడు మల్లప్ప ఉన్నారు.

మృతి చెందిన ప్రేమ్‌సింగ్ కుటుంబాన్ని ఆదుకోవాలి

నారాయణఖేడ్, జనవరి 6: విద్యుదాఘాతంతో మృతి చెందిన ప్రేమ్‌సింగ్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ శనివారం నారాయణఖేడ్ మండలం నాగాపూర్‌లో మృతుని బంధువులు గిరిజనులతో కలసి బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు.

సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడి

'ఆత్మ' ప్రాజెక్టు డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి



మార్డి తండాలో జరిగిన రైతుల సమావేశంలో మాట్లాడుతున్న పీడీ

కల్హేర్, జనవరి 6: రైతులు తమ పంట భూముల్లో సేంద్రియ ఎరువులతోనే అన్ని రకాల పంటలు పండించాలని, భూమి సారాన్ని కోల్పోకుండా అధిక దిగుబడులు రావాలంటే ఈ విధానాన్ని పాటించాలని సంగారెడ్డి జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి రైతుల కు సూచించారు. శనివారం మండల పరిధిలోని మార్డి గిరిజన తండాలో ఆత్మ సౌజన్యంతో వరిసాగు రైతులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ కరుణాకర్ మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడులు రావాలనే ఆత్రుతతో ఎడాపెడా రసాయానిక ఎరువులు వాడకం మూలంగా భూములు సారం కోల్పోవడంతో తీవ్ర నష్టం జరిగే అవకాశాలున్నాయన్నారు. రక్షణ ప్రయోజనం కోసం రైతులు భూములను నిర్లక్ష్యం చేస్తున్నారని ఇదే విధానం కొనసాగితే భవిష్యత్తులో పంటలు పడటం చాలా కష్టమని ఆయన అన్నారు. దీనిని నివారించడానికి వ్యవసాయ శాఖ అనేక రకాలుగా రైతులను అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. దీని ఫలితంగా కొంత మంది రైతుల్లో మార్పు రావడం జరుగుతుందని కానీ అందరూ రైతులు సేంద్రియ ఎరువులనే వాడాలన్నారు. వెనుకటి పంటలకు జనుము, జింక్, పశువుల పేడ, వాడేవారని అన్నారు. ఇక నుంచి కూడా అధిక దిగుబడులకు ఆ ఎరువులను వాడాలన్నారు. జీవామృతం, వాన పాములతో తయారు చేసిన సేంద్రియ వర్మి కాంపోస్టు ఎరువులతో పాటు వ్యవసాయ శాఖ పంపిణీ చేసే హరిత ఎరువులను రైతులు వినియోగించి పంటలు పండిస్తే భూములు సారం కోల్పోకుండా అధిక దిగుబడులు సాధించవచ్చునని పీడీ కరుణాకర్‌రెడ్డి అన్నారు. అనంతరం ఎంపీపీ అధ్యక్షురాలు జమునాబాయికి చెందిన ఒక ఎకరా పొలంలో వరి నాటును సేంద్రియ ఎరువులతో పండించడానికి ప్రదర్శన కోసం ఎంపిక చేయగా అందులో వరి నాటు వేసే పద్ధతిని రైతులకు వ్యవసాయ అధికారులు చూపించారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ ఆత్మ చైర్మన్ శ్రీరాం దిలీప్‌కుమార్, ఏడీఏ శ్రీనివాస్ ప్రసాద్, ఎంపీపీ అధ్యక్షురాలు జమునాబాయి, ఆత్మ డైరెక్టర్ హన్మంత్‌రావు, ఏవో రాంప్రసాద్, ఏఈవోలు మాధవీశ్రీలత, ఏఈవోలు భాస్కర్, సతీష్, మల్లేశం పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావును కలసిన ఖేడ్ వ్యాపారులు



మంత్రి హరీశ్‌రావును కలిసి సమస్యలను విన్నవిస్తున్న ఖేడ్ వ్యాపారులు

నారాయణఖేడ్, జనవరి 6: రాష్ట్ర భారీనీటి పారుదల, మార్కెటింగ్ శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును శనివారం నారాయణఖేడ్ పట్టణానికి చెందిన వ్యాపారులు టీఆర్ఎస్ మైనార్టీ విభాగం రాష్ట్ర నాయకుడు మోయిద్‌ఖాన్ ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మంత్రితో మాట్లాడుతూ నారాయణఖేడ్ పట్టణంలో అనేక దశాబ్దాలుగా కొనసాగుతున్న వారాంతపు సంతను ఇటీవల తహసీల్దార్ మైదానంలోకి మార్చారని, దీనికి తోడు ఆర్టీసీ బస్సులను కూడా మంగల్‌పేట బస్టాండు నుంచే కొనసాగిస్తుండడంతో ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అందువల్ల వారాంతపు సంతను పాత స్థలంలోనే కొనసాగించాలని మంత్రిని కోరారు. వారాంతపు సంత విషయంలో ఆందోళన చేస్తున్న మహిళ వ్యాపారులపై కూడా పోలీసులు లాఠి చార్జి చేశారని వారు మంత్రికి విన్నవించారు. అనంతరం హోంమంత్రి నాయిని నరసింహారెడ్డి, డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ, మంత్రి జోగురామన్న, ఎంపీ బీబీ పాటిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ బిడెకన్నే హన్మంతులను కూడా వ్యాపారులు పలు వాహనాల్లో వెళ్లి కలిసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ మైనార్టీ రాష్ట్ర నాయకుడు మోయిద్ ఖాన్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిలకు విన్నవించామన్నారు. వారు సానుకూలంగా స్పందించారన్నారు. వ్యాపారులు రైతు బజార్‌కు వ్యతిరేకించడం లేదని, కేవలం వారాంతపు సంతతో పాటు ఆర్టీసీ బస్సులను రాజీవ్ చౌక్ వరకు గతంలో మాదిరిగా కొనసాగించాలని సూచించడంతో మంత్రి స్పందించి వెంటనే ఆర్టీసీ అధికారులకు బస్సులు రాజీవ్ చౌక్ వరకు కొనసాగించాలని ఆదేశించారని తెలిపారు. మంత్రులను కలసిన వారిలో వ్యాపారులు సుదర్శన్‌గౌడ్, ప్రకాశ్‌రావు, బి.హన్మండ్లు, మహమూద్, వివేకానంద్ ఉన్నారు.

'రూర్బన్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి'

నారాయణఖేడ్, జనవరి 6: రూర్బన్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సాయిరాం అన్నారు. శనివారం మండల పరిధిలోని ర్యాకల్ గ్రామాన్ని సందర్శించి రూర్బన్ పథకం ద్వారా చేపడుతున్న కార్యక్రమాల వివరాలు గ్రామస్థుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలను కూడా పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో ప్రయోగాత్మకంగా మొదటి దశలో ర్యాకల్ క్లస్టర్‌ను ఎంపిక చేసి రూ.13 కోట్లు మంజూరు చేసిందన్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చిందని తెలియకుండా ఉండడం కోసం అనేక అడ్డంకులు సృష్టిస్తుందన్నారు. ఈ పథకానికి సంబంధించిన వివరాలు గోప్యంగా ఉంచుతున్నారన్నారు. అందువల్ల జిల్లా కలెక్టర్ స్పందించి రుర్బన్ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు సంజీవరెడ్డి, రామక్రిష్ణ, సాయేందర్, శివరాజ్ ఉన్నారు.



రూర్బన్ పథకం అమలు గురించి గ్రామస్థులను అడిగి తెలుసుకుంటున్న బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సాయిరాం

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

నారాయణఖేడ్, జనవరి 6: నారాయణఖేడ్‌లో రాజీవ్ చౌక్ వరకు ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించడంతో టీఆర్ఎస్ శ్రేణులు స్థానిక ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ నెల 1 నుంచి ఆర్టీసీ బస్సులను రాజీవ్ చౌక్ వరకు కాకుండా మంగల్‌పేట బస్టాండు నుంచే కొనసాగించారు. దీంతో పట్టణ ప్రజలతో పాటు అనేక గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారంటూ పలువురు శనివారం మంత్రి హరీశ్‌రావు, స్థానిక ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని కలువడంతో వారి సూచన మేరకు మళ్లీ బస్సులను రాజీవ్ చౌక్ వరకు పునరుద్ధరించడంతో టీఆర్ఎస్ శ్రేణులు ఎమ్మెల్యే చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, ఎంపీటీసీలు రామకృష్ణ, ముజమ్మిల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాసిత్, ఖేడ్ ఇన్‌చార్జి సర్పంచ్ నజీబ్ ఉన్నారు.



ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీఆర్ఎస్ శ్రేణులు

ప్రమాదకరంగా పాడుబడిన బావులు


లాలకుంట కాలనీలో ప్రధాన రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న పాడుబడిన బావి

కోహీర్, జనవరి 6: మండల కేంద్రమైన కోహీర్‌తో పాటు మండల పరిధిలోని బిలాల్‌పూర్, మనియార్‌పల్లి, బడంపేట, సజ్జాపూర్, పిచేరాగడి, రాజన్నెల్లి, గురుజువాడ, మద్రి, దిగ్వాల్ తదితర గ్రామాల్లోని ఇళ్ల మధ్యలో ఉన్న పాడుబడిన బావులతో అనేక రకాల ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని సంవత్సరాల క్రితం తవ్విన ఈ బావులు వినియోగంలో లేకపోవడంతో అవి పాడుబడి గ్రామంలో ఉన్న పశువులు, పెంపుడు జంతువులు బావుల్లో పడి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో రాత్రి వేళలో ప్రజలు కూడా పడి ప్రమాదాలు జరిగాయి. చింతల్‌ఘాట్ గ్రామంలో ఇళ్ల మధ్య ఉన్న పాడుబడిన బావితో ఆ కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. బావిలో ఉన్న కలుషిత నీటితో దుర్వాసన రావడంతో రోగాల బారినపడుతున్నారు. ఆ బావిలో అనేకమార్లు మేకలు, కోళ్లు, పెంపుడు కుక్కలు పడి చనిపోయినట్లు కాలనీ వాసులు వాపోతున్నారు. అంతేకాకుండా ప్రధాన కూడళ్ల వద్ద బావులు ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇళ్ల మధ్యలో బావులు ఉండడంతో కొందరు కుటుంబ తగాదాలు పడి బావిలో పడిన సంఘటనలు ఉన్నాయి. గ్రామాల మధ్యలో ఉన్న పాడుబడిన బావులను ఉపాధిహామీ పథకం కింద పూడ్చివేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పాడుబడిన బావులతో ఇబ్బందులు



పాడుబడిన బావులతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. చాలా గ్రామాల్లో పాడుబడిన బావులు ఇళ్ల మధ్య ఉండడంతో పశువులు, మేకలు, గొర్రెలు అందులో పడి మృత్యువాత పడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రజలు కూడా ప్రమాదవశాత్తు బావిలో పడి ప్రాణాలు కోల్పోతున్నారు.

–అమర్‌నాథ్, మనియార్‌పల్లి

వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలి

» ఏడీఏ సోమేశ్వర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖాధికారి సోమేశ్వర్‌రావు

జహీరాబాద్, జనవరి 6: మారుతున్న కాలానుగుణంగా రైతులు కూడా వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సోమేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని చిన్నహైదరాబాద్, హోతి(బి) గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల సబ్సిడీలు కల్పిస్తున్నామని వివరించారు. ముఖ్యంగా డ్రిప్, పాలిహౌజ్‌లకు రైతులు ప్రాధాన్యమిస్తున్నారని, వాటికే సబ్సిడీ అధికంగా ఉందని ఆయన తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో ఎక్కువగా రైతులు పాలిహౌజ్ వ్యవసాయ సాగుపై ఆసక్తిని చూపుతున్నారన్నారు. పాలిహౌజ్‌ల ద్వారా వ్యవసాయం చేయడంతో గిట్టుబాటు కూడా అధికంగా వస్తుందన్నారు. ముఖ్యంగా పాలిహౌజ్‌లో రైతులు కూరగాయల సాగుకు ఉత్సాహం చూపుతున్నారన్నారు. పాలిహౌజ్‌ల్లో కూరగాయలను పండించిన రైతులు లక్షలు సంపాదిస్తున్నారన్నారు. తక్కువ సమయంలో తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు సాధించే కూరగాయల పంటలను సాగు చేయాలని సూచించారు. సాగు విధానంలో రైతులు రసాయన ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువులను వాడినట్లయితే అందరికి ఆరోగ్యాన్ని పంచినవారవుతారన్నారు. పాలిహౌజ్‌లను ఏర్పాటు చేయాలనుకునే రైతులు ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలన్నారు. గతేడాది జహీరాబాద్ ప్రాంతంలో సుమారు ఐదారు వేల ఎకరాల్లో ఆలు పంటను సాగు చేసి నష్టపోయారన్నారు. గతంలో జరిగిన నష్టాన్ని గుర్తించి రైతులు ఈ ఏడాది ఈ ప్రాంతంలో సుమారు 2వేల ఎకరాల్లో ఆలుగడ్డ పంటను సాగు చేస్తున్నారన్నారు. రైతులు కూరగాయలను సాగు చేయడంతో మార్కెట్ సౌకర్యం అందుబాటులో ఉన్నందున అందరూ కూరగాయల సాగుపై దృష్టి పెట్టాలన్నారు. ఆలుగడ్డ పంటలకు ప్రభుత్వం అందించే సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ విషయంలో ఊసెత్తకపోవడంతో తాము రైతులకు సమాధానం చెప్పడంలో ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమావేశంలో ఉద్యానవన శాఖ డివిజన్ అధికారి కీర్తి, మండల ఉద్యానవన శాఖ అధికారులు విఠల్, రవీందర్, కేవీకే శాస్త్రవేత్త భార్గవి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజలకు ప్రయోజనం

» ఎమ్మెల్సీ ఎండీ ఫరీదుద్దీన్


పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్సీ ఎండీ ఫరీదుద్దీన్

జహీరాబాద్, జనవరి 6: ప్రభుత్వం గడిచిన మూడున్నర ఏళ్ల కాలంగా వివిధ రకాల సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెడుతుందని ఎమ్మెల్సీ ఎండీ ఫరీదుద్దీన్ అన్నారు. శనివారం జహీరాబాద్ పట్టణంలో పలువురు పార్టీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రజల శ్రేయస్సు కోసం చేపడుతున్న పథకాలపై ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. వివిధ పార్టీల నుంచి టీఆర్‌ఎస్ పార్టీలో పెద్ద మొత్తంలో కార్యకర్తలు చేరుతున్నారని తెలిపారు. దీంతో టీఆర్‌ఎస్ జహీరాబాద్ ప్రాంతంలో బలమైన పార్టీగా అవతరించిందన్నారు. ఇదిలా ఉండగా యువతను ఆకర్షించే విధంగా ప్రభుత్వం ఉద్యోగాల నియమాకాలను చేపట్టిందన్నారు. విద్యార్థులు టీఆర్‌ఎస్వీలో చేరడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తేవాలని, వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ లక్ష్మారెడ్డి, నాయకులు సుధీర్‌కుమార్, రాజేందర్‌రెడ్డి, శ్రీను, పాండురెడ్డి, పీటర్, టీఆర్‌ఎస్వీ నాయకులు పర్వఠాం, నవీన్‌తేజ, సమీ, ఫయాజ్, ఓంకార్, సాజిద్, మారుతియాదవ్, దత్తారెడ్డి, రాజు, అఖిల్, నవీన్, అనిల్, మధు, వినిత్, అశోక్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పీడీఎస్‌యూ నాయకులు బెంజుమెన్, శివ, ప్రవీణ్‌లతో కలిపి మరో 50మంది విద్యార్థులు ఎమ్మెల్సీ సమక్షంలో టీఆర్‌ఎస్వీలో చేరారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

» ఎంపీపీ చిరంజీవిప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవిప్రసాద్

జహీరాబాద్, జనవరి 6: రైతుల శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని ఎంపీపీ చిరంజీవిప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని హోతి(బి) గ్రామంలో ఉద్యానవన శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు వాణిజ్య పంటల సాగు విధానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయాలన్నారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబిస్తే ఆశించిన ప్రయోజనం లభిస్తుందన్నారు. గ్రామాల్లో రైతులు ఒకే పంటను సాగు చేయకుండా తక్కువ సమయంలో పండే పంటలను సాగు చేసినట్లయితే రైతులు అభివృద్ధి చెందుతారన్నారు. సంబంధిత అధికారుల సలహాలు, సూచనలు పాటించి సాగు విధానంపై దృష్టి పెట్టాలన్నారు. పంటల సాగులో రైతులు రసాయన ఎరువులకు స్వస్తి పలికి సేంద్రియ ఎరువులతో పంటలను సాగు చేస్తే అధిక దిగుబడులతో పాటు భూమి సారవంతంగా ఉంటుందన్నారు. అలాగే జడ్పీటీసీ కిషన్‌రావుపవార్ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ పథకాలు రైతులకు అందించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రైతులు వ్యయప్రయాసాలకు గురై పంటలను సాగు చేస్తున్నందున ఆశించిన దిగుబడులు రాక ఆందోళన చెందుతున్నారన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పంటల సాగు విధానం, పంటల సాగులో మెళకువలు తదితరాంశాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆత్మ జిల్లా అధికారి గులాంఅహ్మద్ మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంత భూములు వాణిజ్య పంటలకు అనుకూలమైనవన్నారు. వాణిజ్య పంటల సాగులో రైతులు మెళకువలు పాటిస్తే ఆశించినస్థాయిలో పంటలు పండి అభివృద్ధి చెందవచ్చన్నారు. కేవీకే శాస్త్రవేత్త భార్గవి మాట్లాడుతూ పొలాల్లో విత్తనాలు వేసే ముందు రైతులు పొడి దుక్కులను సిద్ధం చేసుకోవాలన్నారు.

చిరువ్యాపారులకు డీసీసీబీ చేయూత

» డిప్యూటీ జనరల్ మేనేజర్ జనార్దన్


డీసీసీబీ బ్యాంక్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ జనరల్ మేనేజర్ జనార్దన్

ఝరాసంగం, జనవరి 6: చిరువ్యాపారులకు డీసీసీబీ బ్యాంకులు రుణాలను అందజేసి వ్యాపారాల అభివృద్ధి కోసం చేయూతనిస్తున్నాయని జిల్లా డీసీసీబీ డిప్యూటీ మేనేజర్ జనార్దన్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని డీసీసీబీ బ్యాంక్‌ను ఆయన సందర్శించారు. బ్యాంక్‌లోని పలు రికార్డులను ఆయన పరిశీలించారు. డీసీసీబీ బ్యాంక్ ద్వారా చిరువ్యాపారులకు వ్యాపారానికి తగ్గట్టుగా రుణాలను అందజేస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీసీసీబీ బ్యాంకుల పరిధిలో ఉన్న మొండి బకాయిలను వసూళ్ల కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8 బృందాలు ఏర్పడి వసూలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను ప్రతి నెలా వాయిదా పద్ధతిలో చెల్లిస్తే వడ్డీ కూడా తక్కువగా ఉంటుందన్నారు. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించకపోతే చట్టప్రకారం వసూలు చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట ఝరాసంగం డీసీసీబీ మేనేజర్ కలీమోద్దీన్, సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్య భారతి అందరి లక్ష్యం కావాలి



ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి

ఝరాసంగం, జనవరి 6: ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారాన్ని తీసుకోవాలని డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. శనివారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని గుల్‌బర్గా ఫంక్షన్ హాల్‌లో ఆచార్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య భారతి అందరి లక్ష్యం కావాలన్నారు. ప్రస్తుతం తీసుకునే ఆహారపదార్థాల్లో రసాయనిక పదార్థాలు అధికంగా ఉన్నాయన్నారు. సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలను, పప్పుదినుసులను వాడాలన్నారు. వీటితో ఎవరి ఆరోగ్యాన్ని వారు కాపాడుకునే అవకాశాలు ఉంటాయన్నారు. విద్యార్థినులు చదువుల్లో రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. చదువుతో పాటు సామాజిక కార్యక్రమాలు కూడా విద్యార్థిని, విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు.

సదస్సుకు ఆసక్తి చూపని ప్రజాప్రతినిధులు

కోహీర్, జనవరి 6: మండల కేంద్రమైన కోహీర్‌లోని ఎంపీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జాతీయ క్యాన్సర్, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, పక్షవాత నివారణ అవగాహన కార్యక్రమానికి ఏ ఒక్క గ్రామ పంచాయతీ నుంచి కూడా సర్పంచులు, ఎంపీటీసీ, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకాలేదు. ఈ సమావేశానికి ఎంపీపీ అనిత, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ శ్రీధర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామల, మరో ముగ్గురు వైద్య సిబ్బంది మాత్రమే హాజరయ్యారు. ప్రజాప్రతినిధులెవరూ ఈ సమావేశానికి హాజరుకాకపోవడంతో అధికారులు చేసేదేమి లేక వెళ్లిపోయారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

కోహీర్, జనవరి 6: మండల పరిధిలోని గురుజువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో పదో తరగతి ఉర్దూ మీడియం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఐఎం మండల అధ్యక్షుడు ఎండీ రఫీ మాట్లాడుతూ విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను బాగా చదువుకుని వచ్చే వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో మోహిన్, ఫారూక్‌అలీ, శంశొద్దీన్, వాజిద్ పాల్గొన్నారు.

ఆ నలుగురు?

పెళ్లికి పిలిస్తే వెళ్లాలి.. చావు కబురు తెలిస్తే వెళ్లాలి అని పెద్దలు చెబుతుంటారు. కానీ ప్రస్తుత సమాజంలో చావుకు పిలిచినా వెళ్లలేని దుస్థితి. గ్రామీణ ప్రాంతాల నుంచి ఇతర దేశాలకు వెళ్లిన వారు తమ తల్లిదండ్రుల అంత్యక్రియలకు కూడా రాలేకపోతున్నారు. ఇంకొంతమంది బతికున్నప్పుడు తమ కోసం ఏమీ చేయలేదని రావడంలేదు. ఇప్పుడు నలుగురి ఆప్యాయతను సంపాదించుకోవడం గగనమైపోయింది. ఆత్మ అజాత శత్రువని భీష్ముడు భారతంలో చెప్పాడు.. అందుకే ఎవరైనా మరణిస్తే ఆ నలుగురు మనమై అంత్యక్రియలు నిర్వహించాలని పెద్దలు సూచిస్తున్నారు.

- వాహనం లేకపోతే మృతదేహం తరలని స్థితి
- గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణం
- అడ్డంకులుగా మారిన ఆచార వ్యవహారాలు
- తగ్గుతున్న బాంధవ్యాలు

అక్కన్నపేట, జనవరి5: ఒక్కడై రావడం, ఒక్కడిగా పోవడం సృష్టి దర్మం. కాని ఆ పొయే క్రమంలో నలుగురి ఆప్యాయతను సంపాదించు కోవడం మంచి తనానికి నిదర్శనం. మరణానం తరం మృతదేహాన్ని మోసేందకు నలుగురిని సంపాదించుకోగలమా అనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుత సమాజంలో తమకు ఆస్థి పంచలేదని ఇతరులకు ఎక్కువగా ఇచ్చాడని, బతికుండగా మా ఇంటికి రాలేదని ఇలా అనేక కారణాలతో మరణించిన వారిపై కూడా పట్టు సాధించే సందర్భాలూ లేక పోలేదు. పెళ్లికి పిలిస్తే వెళ్లాలి. చావు కబురు తెలిస్తే రావాలి అనేది పెద్దల నానుడి. అయితే అది ఆచరణలో మాత్రం ఉండడం లేదు. ఆ శకునాలు.. ఈ శకునాలు అంటూ కొంత మంది, ఆస్థి తగాదాలు అంటూ మరికొంత మంది అత్యక్రియల వద్దకు వెళ్ల కుండా దూరంగా ఉంటున్న రోజులివి. దీంతో అయిన వారితో అంత్యక్రియలు నిర్వహించుకో వడం అనేది ఎవరికో తప్ప సాధ్యం కావడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి పద్ధతులు ఎక్కువగా పాటిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబసభ్యులు ఆనలుగురి కోసం అన్వేషించాల్సి వస్తుంది.

ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో నివాసం ఉండే వారిలో ఎక్కువ మంది వృద్ధులు కావడం. యువతరం వలసలు వెళ్లి పోవడం, ఎవరికి వారు దూరంగా నివసించడం. సమయానికి అందుబాటులో లేక పోవడం పెద్ద సమస్యగా మారింది. దీంతో అదే సామాజిక వర్గానికి చెందిన వారితో లేక దూరపు చుట్టాలను బతిమిలాడుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొరివి పెట్టడానికి కొడుకులు ఉన్నా వాళ్లు అమెరికా లేదా ఇతర దేశాల నుంచి రావడానికి మూడు నాలుగు రోజులు పట్టడంతో చేసేదేమి లేక అయిన వాళ్లే అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఘటనలు పరిపాటిగా మారాయి. ఒకప్పుడు సంప్రదాయాలు, విలువలు కట్టు బాట్లకు పెద్ద పీట వేసే వారు నేడు కనీసం తలకొరివి పెట్టించుకోలేని దుస్థితి.. మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితులకు నిదర్శనం. పుత్రుడు పున్నామనరకం నుంచి తప్పిస్తాడనేది నిజమో, కాదో తెలియదు కాని మరణించిన మనిషి ఆత్మతృప్తికి మాత్రం అది అవసరం. తల కొరివి పెట్టడమొక్కటే కాదు తన గోత్రికులు, తనను ఘనంగా సాగనంపాలనేది కూడా వారి ఆలోచన. కొందరు వృద్ధులయితే తాము కాలం చేస్తే తల కొరివి పెట్టేందుకు కచ్చితంగా రావాలంటూ బతిమిలాడుకుంటున్న సందర్భాలూ లేక పోలేదు. వారి వేదన, ఆవేదన చూసిన కొందరు ముసలోడు ఇలా మాట్లాడుతున్నాడేంటి అని కొట్టి పారేస్తారు. ఆర్థిక సంబంధాలే అన్నింటినీ శాషిస్తున్న రోజులివి. ఇటీవల ఎక్కడైనా ఓ మనిషి చనిపోతే సంబంధిత వ్యక్తి తాలుకూ పెద్దమనిషి కాటికి ఎవరు తీసుకెళ్తారా అనే ఆలోచనలో పడుతున్నాడు. పట్టణ, గ్రామీణ ప్రాంతం అని తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో ఉన్న దుస్థితి ఇది. మారుతున్న కాలంలో పార్థివ దేహాలను తీసుకెళ్లేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయి. ఇన్ని సదుపాయాలు ఉన్నా.. కనీసం పార్థివ దేహన్ని వాహనం వద్దకు తీసుకెళ్లేందుకు కాని అనంతరం అంత్యక్రియల ప్రదేశంలో నిర్వహించేందుకు తప్పనిసరిగా ఆ నలుగురి అవసరం ఉంది. ఆ నలుగురిని వెతుక్కునే పరిస్థితి ఎలా ఉన్న తల కొరివి పెట్టేవాడి కోసం వెతుక్కుంటున్న ఈ రోజుల్లో ఆ నలుగురిని సంపాదించగలిగిన వాడు నిజంగా గొప్పవాడే.



గరుడ వాహనం


వైకుంఠ ధామం

మనిషి చనిపోతే అంత్యక్రియలు నిర్వహించడానికి కుమారుడు, పార్థివ దేహన్ని తీసుకెళ్లేందుకు నలుగురు గోత్రికులు(వంశీకులు), ఉండి తీసుకెళ్తే చనిపోయిన వ్యక్తి ఆత్మ శాంతిస్తుందనేది నమ్మకం. ఈ నమ్మకాన్ని నమ్ముకుంటే శవం కదిలే పరిస్థితి లేదు. గోత్రికులు కాదు కదా కనీసం అదే సామాజిక వర్గానికి చెందిన వారు కూడా అందుబాటులో ఉండడంలేదు. కొన్ని చోట్ల ఈ సంప్రదాయానికి తెరదించి మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియకు సహకరించడం సంతోషించాల్సిన విషయం. పట్టణ ప్రాంతాలకు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి ఊరికి ఒక్కరు స్థిర పడిపోయారు. దీంతో ఒక్క వంశానికి సంబంధించిన వారు ఒక్క చోటుకు రావడం అనేది అసాధారణం.

కనుమరుగవుతున్న బంధాలు

శరీరం నుంచి ఆత్మ వదిలిన తర్వాత అతడు ఆజాత శత్రువని బీష్ముడు భారతంలో చెప్పాడని పెద్దలు చెబుతుంటారు. దీనిని ప్రామాణికంగా తీసుకున్న మృతదేహంపై సాధింపులు అవసరం లేదు. నలుగురు వెళ్లి ఆ ప్రక్రియ నిర్వహిస్తే వారికి గౌరవం పెరుగుతుందే కాని తగ్గదు. ఇది తెలుసు కోలేక ఎదో సాధించామని చనిపోయిన మనిషిపై లేని పోని ప్రచారాలు చేసి అబాసు పాలవుతున్నారు. అన్నింటిసీ పక్కన బెట్టి అంత్యక్రియలకు హాజరై సంప్రదాయాలను గౌరవిస్తే.. భావి తరాలకు ఉన్నత సాంకేతాలు ఇచ్చిన వారమవుతాం. అందుబాటులో లేని వారికి స్నేహితులే బంధువులు. అందుబాటులో ఉన్న వారు సంప్రదాయాలను గౌరవించాలని పెద్దలు సూచిస్తున్నారు.

అడ్డంకులుగా మారిన ఆచారాలు

అదే వంశానికి చెందిన గోత్రికులు తీసుకెళ్తే మంచిది.. అనేది నేటికి అనుసరిస్తున్న సంప్రదాయం. దీనిని నేటి తరానికి ఆచరించాలనే కోరికలున్నా అవి నెరవేరని పరిస్థితి. కనీసం ఒకే సామాజిక వర్గానికి చెందిన వారైనా ఈ కార్యక్రమంలో పాలు పంచుకోవాలనేది కూడా సంప్రదాయమే. దీనికి ఎదురు వెళ్లలేక ఆ సామాజిక వర్గం వారు అందుబాటులో లేక కొందరు సతమతమవుతాన్నారు. ఈ సంప్రదాయాలను కాదని అనేక చోట్ల మృతుడిపై అభిమానం ఉన్న వారు సామాజిక వర్గంతో సంబంధం లేకుండా అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ మార్పు కనబడడం లేదు.

గ్రామీణ ప్రాంతాల్లో మరీ దారుణం...

పట్టణ ప్రాంతాల్లో గరుఢ వాహనాల పేరుతో మృత దేహలను తీసుకెళ్లేందుకు కొన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఈ ప్రక్రియ కొంత మేర సజావుగానే సాగుతున్నది. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం ఇలాంటి ఏర్పాట్లు లేవు. దీనికి తోడు స్మశానాలు గ్రామానికి దూరంగా ఉండడం కనీసం 5 కిలోమీటర్ల పైగా నడవాల్సిన పరిస్థితి ఉండడంతో ఎవరూ ముందుకు రావడం లేదు. వాహనాలు అందుబాటులో ఉండవు. సంప్రదాయాలకు ఎదురెళ్లలేరు. దీంతో అంత్యక్రియల ప్రక్రియ క్లిష్టంగా మారుతున్నది.

సెల్‌ఫోన్ భూతం

- వ్యసనంగా మారుతున్న స్మార్ట్ ఫోన్ వాడకం
- పిల్లల ఎదుగుదలపై దుష్ప్రభావం
- పిల్లల్లో పెరుగుతున్న దృష్టి లోపం
- తల్లిదండ్రులే కారణమంటున్న నిపుణులు

కొమురవెల్లి రూరల్, జనవరి 6:

చింటూ సెల్‌ఫోన్‌తో ఆడడం ఇక ఆపేయ్యరా.. ఓ తల్లి అరుపు.

ఇప్పుడే కదా మొదలు పెట్టా.... చింటూ సమాధానం.

ఈ సంభాషణ ప్రతి ఇంట్లో ఉండేదే. సెలవు రోజుల్లో ఇంకా ఎక్కువ సార్లు వినిపిస్తుంది. తల్లిదండ్రులు హాలీడేను జాలీడేగా పరిగణించే రోజులు పోయాయి. రిస్క్‌డేగా భయపడుతున్నారు. పిల్లలకు సెల్‌ఫోన్ వినియోగం ఓ వ్యసనంలా మారిందని తల్లిదండ్రుల ఆరోపణ. సెలవు రోజు కూడా ఫోన్‌తో ఆడనివ్వరన్నది పిల్లల ఆరోపణ. అలవాటు ముదిరి వ్యసనం అవుతుందని ఫలితంగా పిల్లలు భవిష్యత్తులో తీవ్ర దుష్ప్రభావానికి లోనవుతారని నిపుణులంటున్నారు. పెరుగుదల గణనీయమైన రీతిలో ఉండే బాల్యంలో శారీరక శ్రమ లేకపోవడం వల్ల పిల్లల్లో శరీర అభివృద్ధి కావలసినంత జరగడం లేదని ఫలితంగా భవిష్యత్తులో తీవ్ర దుష్ప్రభావాన్ని చూపుతుందని వైద్యులంటున్నారు. తల్లిదుండ్రులు పిల్లలతో కాసేపు సరదాగా గడపడంలో విఫలమవుతున్నారని, విరామం లేని జీవితంలో తమ విద్యుక్తధర్మాన్ని నిర్వహించడం లేదని మానసిక శాస్త్రవేత్తల అభిప్రాయం. ఫలితంగా పిల్లలు దారి తప్పుతున్నారని దీనికి ప్రధానకారణం తల్లిదండ్రులేనని శాస్త్రవేత్తలు తెలుపుతున్నారు.

స్మార్ట్ ఫోన్ వాడకం వల్ల సమస్యలు

స్మార్ట్‌ఫోన్‌ను అధికంగా వాడడం వల్ల అలసట, తీవ్రమైన కళ్ల మంటలు, కళ్లు కరకరలాడడం, వస్తువులు మసకబారినట్టు కనబడడం, తలనొప్పి, మెడనొప్పి, వెన్ను నొప్పి, దృష్టిలోపం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని నిపుణులంటున్నారు.



పిల్లలతో గడపడమొక్కటే మార్గం

నేటితరం పిల్లలు శారీరకబలాన్ని పెంచే ఆటలకన్నా మొబైల్ గేమ్స్ పైనే ఎక్కువ శ్రద్ధ వహిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం తల్లిదండ్రులు తగినంత సమయం వారికోసం కేటాయించకపోవడమే. చిన్న వయసులో పిల్లల మానసిక స్థితిని నియంత్రించడం సులభం. హోమ్వర్క్‌లో సహాయపడడం, కథలు చెప్పడం, వినడం, పిల్లలకు ఇష్టమైన రంగాన్ని గుర్తించి, వారి మనసును దానిపైకి మళ్లించడం, ఇంటిపనుల్లో పిల్లలు భాగస్వాములయ్యేలా ప్రోత్సహించడం, దినపత్రికలు చదివించడం వల్ల పిల్లలను ఫోన్‌కు దూరం చేయొచ్చు. పేరెంట్స్ ఎక్కువ సమయం తమ పిల్లలతో గడపడం అత్యుత్తమ మార్గం. స్మార్ట్ ఫోన్ నుంచి మామూలు ఫోన్‌కి మారడం మరోమార్గం. ప్రస్తుత ఇది అంత సులభం కాకున్నా తర్వాతి తరం భవిష్యత్తు కోసం అత్యవసరం. చదువు విషయంలో అత్యవసరమైతే తప్ప సెల్‌ఫోన్ ఇవ్వకూడదు. మానవ సంబంధాలను విచ్ఛిన్నం చేయగల శక్తిగా మారుతున్న ఈ సాధనాన్ని ఎంతవరకు వాడాలో పిల్లలకు ఎప్పటికప్పుడు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

–జైపాల్‌రెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణుడు


స్మార్ట్ ఫోన్ లో లీనమైన పిల్లలు



అతిగా వాడడం ఎంతో ప్రమాదం

సెల్ ఫోన్ వాడకం పిల్లల కంటిపై తక్షణ తీవ్ర ప్రభావం చూపుతుంది. స్మార్ట్ ఫోన్ నుంచి విడుదలయ్యే రేడియేషన్ ఎంతో ప్రమాదకరం. ఫలితంగా కలిగే ఒత్తిడి వల్ల కంటిలోని తడి ఆరిపోతుంది. ఈ సమయంలో మంట, ఇరిటేషన్ కలుగుతుంది. కళ్లు నలుపుకోవడం చేస్తారు. ఈ సమయంలో తల్లిదండ్రులు గుర్తించి తగు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే కంటి వ్యాధి నిరోధకశక్తి తగ్గి కంజెక్టివిటీస్ అనే వ్యాధి బారిన పడతారు. జ్ఞానేంద్రియాల్లో అతి సున్నితమైన అత్యవసరమైనవి కళ్లు. దీనిలోని కండరాలకు నిరంతర వ్యాయామం అవసరం. అయితే పిల్లల్లో తదేకంగా ఫోన్ వాడకం వల్ల కనుగుడ్డు సామర్థ్యం తగ్గిపోతుంది. ఫలితంగా ఈ మధ్య కాలంలో డ్రై ఐస్ సింగ్రోమ్ అనే వ్యాధి బారిన పడుతున్నారు. అందువల్లనే చాలా మందికి పిల్లలకు అద్దాలు వాడడం అధికమవుతున్నది. ఎక్కువ నీటిని తాగుతూ కనురెప్పలను ఆర్పుతూ ఉండడం వల్ల సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు.

– సత్యనారాయణ, నేత్రవైద్యుడు





ప్రథమ బహుమతి పొందిన ముగ్గుతో విజేత అవంతి, ముగ్గు వేస్తున్న ద్వితీయ విజేత సౌమ్య, ముగ్గు వేస్తున్న తృతీయ విజేత శ్వేత, పోటీల పర్యవేక్షకుడు శంకర్‌గౌడ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న జేసీ, స్పాన్సర్ శ్రీనివాస్ చౌదరి



పుడమి మురిసేలా..

- మెదక్‌లో ఆకట్టుకున్న 'ఆంధ్రజ్యోతి' ముగ్గుల పోటీ

అందమైన రంగవల్లులు అవనికే కొత్త అందాలను తెచ్చిపెట్టాయి. మెదక్ జిల్లా కేంద్రంలో ఆంధ్రజ్యోతి–ఏబీఎన్ నిర్వహించిన టాటా జెమిని టీ ముత్యాల ముగ్గుల పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ పోటీలు టేస్టు పార్ట్‌నర్ గోల్డ్ డ్రాప్, ఫ్యాషన్ పార్ట్‌నర్ డిగ్‌సెల్, హెల్త్ పార్ట్‌నర్ అమృతబిందు సౌజన్యంతో స్థానిక వెంకట్రావ్‌నగర్ కాలనీలోని సిద్ధార్థ్ మోడల్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించారు. పోటీలకు స్పాన్సర్‌గా శ్రీనివాస్ చౌదరి వ్యవహరించగా.. అతిథిగా జేసీ నగేష్ హాజరయ్యారు.




ప్రథమ బహుమతిగా అవంతికి నగదును అందజేస్తున్న జేసీ నగేష్, ఆర్డీవో నగేష్, డీఎఫ్‌వో పద్మజారాణి, స్పాన్సర్ శ్రీనివాస్‌చౌదరి, సంధ్యారాణి, ఆంధ్రజ్యోతి జిల్లా ప్రతినిధి పరశురాం, ద్వితీయ బహుమతిని అందుకుంటున్న సౌమ్య, తృతీయ బహుమతిని అందుకుంటున్న శ్వేత


ముగ్గులను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో పద్మజారాణి


నవ్య, అమృతబిందు, డిగ్‌సెల్, జెమినీ టీ, ఏబీఎన్–ఆంధ్రజ్యోతి లోగోలను వేస్తున్న విద్యార్థులు


ఓ చేతిలో బిడ్డ.. మరో చేత్తో ముగ్గు


వ్యాఖ్యాత శ్రీనివాస్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఆంధ్రజ్యోతి బృందం


ముగ్గులను తిలకిస్తున్న మహిళలు


ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు పద్మావతి, కల్యాణి

విషయాధారిత వాదాన్ని ప్రతిపాదించినవారు?

ఎస్‌జిటి సోషల్ మెథడ్స్

నమూనా ప్రశ్నలు

1. ఉపాధ్యాయుడు తరగతి గదిలో ఉపయోగించాల్సిన పద్ధతులు, సాధనాలు, విషయ పరిజ్ఞానాన్ని తెలియజేస్తూ అది విద్యార్థుల్లో ఎలా నిర్దిష్ట లక్ష్యాలను సాధించేందుకు ఉపయోగపడతాయో సూచించే పథకమే పాఠ్యపథకం...అని నిర్వచించింది?

1) ఎల్.బి.స్టాండ్ 2) బోసింగ్
3) బైనింగ్ అండ్ బైనింగ్ 4) స్టీవెన్‌సన్

సమాధానం: 2

వివరణ: ఒక పీరియడ్‌లో బోధించాలని నిర్ణయించిన దాన్ని పీరియడ్ పథకం లేదా పాఠ్య పథకమని అంటారు. ఇది ఉపాధ్యాయుడు తరగతి గదిలో బోధించాల్సిన విధానాన్ని తెలిపే ప్రక్రియ. ఇది ఉపాధ్యాయుని కార్యక్రమాలు, పాఠ్యాంశంపై ఉన్న అవగాహన తదితర అంశాలను తెలియజేస్తుంది. ఆవశ్యకత, లక్షణాలు తదితరాల ఆధారంగా పీరియడ్ పథకం లేదా పాఠ్యపథకానికి విద్యారంగ నిపుణులు వివిధ రకాలుగా నిర్వచించారు.

2. 'భారతదేశం-నదీ వ్యవస్థ'కు సంబంధించి బోధనలో భాగంగా ఉపాధ్యాయుడు... విద్యార్థులతో భారతదేశ మ్యాప్‌లో నదులను గుర్తించడాన్ని అభ్యసింపజేస్తున్నాడు. ఇది పీరియడ్ ప్రణాళికలోని ఎన్నో బోధన సోపానం?

1) 1 2) 2 3) 3 4) 4

సమాధానం: 4

వివరణ: సాంఘికశాస్త్ర బోధనకు సంబంధించి పీరియడ్ ప్రణాళికలో నాలుగు బోధన సోపానాలున్నాయి. అవి...1.ఉపోద్ఘాతం(పలకరింపు, మైండ్ మ్యాపింగ్/పునశ్చరణ ప్రశ్నలు;పాఠ్యాంశ ప్రకటన); 2.పాఠ్యాంశాన్ని చదివి తెలియని పదాలు, భావనలను గుర్తించడం(గుర్తించడం, అవగాహన కలిగించడం, భావనల అవగాహన-చర్చ); 3.భావనల అవగాహన-చర్చ(మాట్లాడించడం, ప్రశ్నించడం, భావనలపై అవగాహన ప్రశ్నలు); 4.నైపుణ్యాల అభ్యసన(సమాచార నైపుణ్యాలు, పట నైపుణ్యాలు). దీనివల్ల పిల్లల్లో సమాచార నైపుణ్యాలపై సేకరణ, నమోదు, విశ్లేషణ, నిర్ధారణకు రావడం తదితర లక్షణాలు పెంపొందుతాయి.

3. మానవులను సామాజిక సమూహాలుగా ఐక్యపరిచే పవిత్ర విశ్వాసాలు, ఆచారాల వ్యవస్థే మతం...అని అన్నది?

1) డర్క్‌హోమ్ 2) జోసెఫ్ డి.నోవక్
3) పటేల్ కమిటీ 4) జాన్‌డ్యూయీ

సమాధానం: 1

వివరణ: శారీరక లక్షణాలు, తెలివితేటలు, వారసత్వ ప్రభావాలు తదితర అంశాలను భౌతికాంశాలుగా; మతం, కులం, సంస్కృతి, ఆర్థిక పరిస్థితులు, రాజకీయ పరిస్థితులు, సామాజిక వర్గాలు తదితర అంశాలను సాంఘిక అంశాలుగా చెప్పొచ్చు. ప్రస్తుతం సమాజ వికాసంలో సాంఘికాంశాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఈ క్రమంలో పాఠ్యప్రణాళిక, విద్యా లక్ష్యాలు, బోధన పద్ధతులు తదితరాలను సాంఘికాంశాలు శాసిస్తున్నాయి. ప్రస్తుతం సాంఘికశాస్త్ర అవగాహనకు వివిధ అంశాలు తోడ్పడుతున్నాయి. అవి...మతం, కులం, సామాజిక వర్గం, విజ్ఞానశాస్త్రం, రాజకీయ పరిస్థితులు, ఆర్థిక పరిస్థితులు. వీటిలో మతానికి డర్క్‌హోమ్ ఆలోచనాత్మక నిర్వచనం ఇచ్చాడు.

4. 'పిల్లలకు నిజాయితీని అలవరచడం విద్యాభ్యాసంలో తొలిమెట్టు' అని చెప్పినవారు?

1) జాన్ వి.హైఖేలిన్ 2) సెకండరీ విద్యా కమిషన్
3) జాన్‌రస్కిన్ 4) జేమ్స్ హెమ్మింగ్స్

సమాధానం: 3

వివరణ: సమాజంలో ఒక సభ్యుడిగా మనిషి సముపార్జించుకున్న విజ్ఞానం, విశ్వాసం, కళ, నీతి సూత్రాలు, న్యాయం, ఆచారాలు, ఇతర సామర్థ్యాలు, అలవాట్లను మొత్తంగా కలిపి సంస్కృతిగా చెప్పొచ్చు. సాంఘికశాస్త్ర అవగాహనలో వివిధ సాంస్కృతిక అంశాలు, పాత్ర పోషిస్తాయి. ఈ క్రమంలోనే పిల్లలకు నిజాయితీని అలవరచడం విద్యాభ్యాసంలో తొలిమెట్టు అని ప్రముఖ బ్రిటిష్ సామాజికవేత్త జాన్ రస్కిన్(1819-1900) పేర్కొన్నాడు.

5. సామూహిక కృత్యమైన 'క్విజ్' ద్వారా సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు విద్యార్థుల్లో పెంపొందించే అంశాలు?

1) విషయ పరిపుష్టి 2) పఠనాసక్తి
3) నైపుణ్యాభివృద్ధి 4) పైవన్నీ

సమాధానం: 4

వివరణ: సాంఘికశాస్త్రాలకు సమాజమే ఒక ప్రయోగశాల కాబట్టి పిల్లలు సమాజంలోని కుటుంబం, సామాజిక సంస్థలు, పాఠశాల ఉపాధ్యాయుడు, సమ వయస్కు బృందాలు, సహ విద్యార్థులు తదితరాల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకుంటారు. అయితే ఆ విధంగా నేర్చుకునేందుకు ఉపాధ్యాయుడు అనువైన వాతావరణాన్ని ఏర్పరచాలి. క్విజ్; ఆల్బమ్/స్క్రాప్‌బుక్ తయారీ; స్టాంపులు, నాణేల సేకరణ; సాంఘికశాస్త్ర మేళాల నిర్వహణ; సామాజిక సేవా కార్యక్రమాలు; సాంఘికశాస్త్ర క్లబ్బులు తదితరాలను నిర్వహించాలి. ఈ కార్యక్రమాల నిర్వహణలో ఉపాధ్యాయుడు బోధకుడి పాత్ర నుంచి సహకారి, సహ అభ్యాసకుడి పాత్రను పోషించాల్సి ఉంటుంది. సామూహిక కృత్యాల్లో క్విజ్ కీలకమైనది. దీనివల్ల విద్యార్థుల్లో విషయ పరిపుష్టి, పఠనాసక్తి, నైపుణ్యాభివృద్ధితో పాటు బృందాల మధ్య పోటీతత్వం పెంపొందించవచ్చు. విద్యార్థుల్లో దాగియున్న అంతర్గత శక్తి సామర్థ్యాలను వెలికితీయొచ్చు. అదే విధంగా అభ్యసనలో యాంత్రికతను దూరం చేయొచ్చు.

6. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు ఇటీవల ఆంధ్రజ్యోతి పత్రికలో సింగరేణి బొగ్గు గనులకు సంబంధించి ప్రచురితమైన ఓ చిత్రాన్ని విద్యార్థులకు చూపిస్తూ...దానిపై ప్రశ్నలు అడిగాడు. విషయాధారిత ఉపగమంలో ఈ ప్రశ్నలు ఏ రకానికి సంబంధించినవి?

1) అనుమతి ప్రశ్నలు 2) వ్యాఖ్యాన ప్రశ్నలు
3) బదిలీ ప్రశ్నలు 4) పరికల్పన గురించి ప్రశ్నలు

సమాధానం: 1

వివరణ: విచారణాధారిత ఉపగమంలో ఉపాధ్యాయుడు కేవలం సౌకర్యకర్తగా ఉంటూ, విద్యార్థిలో రేకెత్తిన భావ సంచయనాన్ని, క్రమబద్ధ క్షేత్ర నియమాలతో అనుసంధానం తదితరాల ద్వారా సక్రమ అభ్యసన జరిగేందుకు కృషిచేస్తాడు. ప్రశ్నలు సొంత పరిశోధనకు గుండెకాయలాంటివి. ప్రశ్నలు సంప్రదాయ తరగతిలో ఒక భాగం. ప్రశ్నాపద్ధతులు విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపుదలకు ఉపయోగకరంగా ఉండాలి. విషయాధారిత ఉపగమంలో నాలుగు రకాల ప్రశ్నలను పేర్కొన్నారు. అవి... 1. అనుమతి ప్రశ్నలు; 2. వ్యాఖ్యాన ప్రశ్నలు; 3. బదిలీ ప్రశ్నలు; 4. పరికల్పన గురించి ప్రశ్నలు. అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా అనుమతి ప్రశ్నలుంటాయి. ఈ రకం ప్రశ్నల ద్వారా విద్యార్థులు తక్షణమే జ్ఞానార్జన చేస్తారు.

7. ఎరిక్సన్ మనోవైజ్ఞానిక భావాలపై ఆధారపడిన సాంఘిక జట్టుపనిలోని విధానం?

1) నివారణ పద్ధతి(Remidial Model)
2. అన్యోన్య లేదా మధ్యవర్తిత్వ పద్ధతి(Reciprocal or Mediatory Model)
3. అభివృద్ధి పద్ధతి(Development Model)
4. సాంఘిక లక్ష్య పద్ధతి(Social Goal Model)

సమాధానం: 3

వివరణ: వ్యక్తి సొంతంగా నిర్వహించిన సామాజిక పనికంటే సామూహికంగా లేదా జట్టుగా చేసిన పని ఫలితం ఎక్కువగా ఉంటుంది. జట్టుపని వల్ల నైపుణ్యాలు ఎక్కువగా అభివృద్ధి చెందుతాయి. సాంఘిక జట్టుపనిలో నాలుగు విధానాలున్నాయి. అవి.. 1) నివారణ పద్ధతి 2) అన్యోన్య లేదా మధ్యవర్తిత్వ పద్ధతి 3) అభివృద్ధి పద్ధతి 4) సాంఘిక లక్ష్య పద్ధతి. ఎరిక్సన్ మనోవైజ్ఞానిక భావాలపై అభివృద్ధి పద్ధతి ఆధారపడి ఉంటుంది. ఇది బృంద వైశిష్ట్యాలు, సంఘర్షణ సూత్రంపై నిర్దిష్టత కలిగి ఉంటుంది. బృందాలు పూర్తి స్వేచ్ఛ కలిగి, ఏకచ్ఛత్రాధిపత్యం కలిగి ఉంటాయి. బృందాల్లోనివారు ఆయా సంఘాల్లోని భావాలకు అనుగుణంగా ప్రవర్తిస్తారు. లక్ష్యాల సాధనకు అభివృద్ధి పథంలో పయనిస్తారు.

8. భారతదేశ జీవ నదులు అనే పాఠ్యాంశ బోధనలో భాగంగా ఉపాధ్యాయుడు ఓ వీడియో ఆధారంగా బోధిస్తున్నాడు. ఇది సాంఘిక శాస్త్ర బోధనావనరుల్లో ఏ రకమైన వనరు?

1) భౌతిక వనరు 2) లిఖిత/అలిఖిత వనరు
3) ద్వితీయ వనరు 4) ఏదీకాదు

సమాధానం: 2

వివరణ: సాంఘికశాస్త్ర బోధన వనరులను ప్రధానంగా రెండు రకాలు విభజించొచ్చు. అవి... 1. ప్రాథమిక వనరులు(Primary Sources), 2. ద్వితీయ వనరులు(Secondary Sources). ప్రాథమిక వనరుల్లో భౌతిక వనరులు, లిఖిత/అలిఖిత వనరులు ఉంటాయి. కట్టడాలు, దేవాలయాలు, మ్యూజియాలు, కళాకృతులు, పాత్రలు తదితరాలు భౌతిక వనరుల కిందకు వస్తాయి. డైరీలు, ఉపన్యాసాలు, మౌఖిక చరిత్రలు, ఆడియో, వీడియో రికార్డింగ్, జనాభా రికార్డులు, చాయాచిత్రాలు, పోస్టరులు తదితరాలను లిఖిత/అలిఖిత వనరులుగా చెప్పొచ్చు.

9. భారతదేశాన్ని సందర్శించిన మొదటి విదేశీ యాత్రికుడు మెగస్తనీస్ కాగా, మనదేశాన్ని సందర్శించిన తొలి చైనా యాత్రికుడు ఎవరు?

1) ఫాహియాన్ 2) హుయాన్‌త్సాంగ్
3) అల్‌బరూని 4) మార్కోపోలో

సమాధానం: 1

వివరణ: బౌద్ధమత గ్రంథాల్లో నిక్షిప్తమైయున్న భారతీయ సంప్రదాయాల గురించి తెలుసుకునేందుకు, వాస్తవ నిరూపణల కోసం ఫాహియాన్ క్రీ.శ.399లో గుప్తుల కాలంలో దేశంలో పర్యటించాడు. భారత్‌లోని తన అనుభవాలను, భారతీయ తత్వశాస్త్ర గొప్పతనాన్ని తన 'ప్రయాణ దర్శిని'లో రాశాడు. రెండో చంద్రగుప్త మౌర్యుని కాలంలో న్యాయం, ప్రజలపై రాజుల బాధ్యతలు తదితర అంశాలను క్షుణ్నంగా వివరించాడు. ఫాహియాన్ 'ప్రయాణ దర్శిని'ని బౌద్ధమత ఇతిహాసంగా కూడా చెప్పొచ్చు.

10. రాష్ట్రంలో 2012-17 మధ్యకాలంలో పప్పుధాన్యాల ఉత్పత్తి గురించి బోధించేందుకు ఉపాధ్యాయుడికి అనువుగా ఉండే గ్రాఫ్‌లు?

1) లైన్ గ్రాఫ్‌లు 2) బార్ గ్రాఫ్‌లు
3) సర్కిల్ గ్రాఫ్‌లు 4) చిత్రాల గ్రాఫ్‌లు

సమాధానం: 2

వివరణ: గణాంక పట్టికల వివరాలను విద్యార్థులకు వివరించడానికి గీతలు లేదా చుక్కల ద్వారా చూపే రేఖాచిత్రాలను గ్రాఫులంటారు. గ్రాఫుల్లో లైన్ గ్రాఫ్‌లు, బార్ గ్రాఫ్‌లు, సర్కిల్ గ్రాఫ్‌లు, చిత్రాల గ్రాఫ్‌లు, ప్లానల్ గ్రాఫ్‌లు ఉంటాయి. నిలువుగా లేదా అడ్డంగా పొడవైన స్తంభంలాంటి గీతల ద్వారా ఒక అంశంలో క్రమానుగత అభివృద్ధి లేదా మార్పులను బార్‌గ్రాఫ్‌ల ద్వారా చూపించవచ్చు.

11. విషయాధారిత వాదాన్ని ప్రతిపాదించినవారు?

1) రోజర్ శాంక్, అతని శిష్యబృందం
2) జాన్‌డ్యూయీ, అగస్టన్
3) యశ్‌పాల్ కమిటీ
4) సెకండరీ విద్యా కమిషన్

సమాధానం: 1

వివరణ: గత సమస్యల సాధన అనుభవం ద్వారా కొత్త సమస్యలను సాధించడం విషయాధారిత వాదం. ఇది కేవలం కంప్యూటర్ ఆధారిత సమస్యల సాధనకే కాకుండా, నిత్యజీవితంలో మనిషికి ఎదురయ్యే అన్ని రకాల సాధనకు ఉపయోగపడుతుంది. వ్యక్తిగతంగా గతంలో పొందిన అనుభవాల ఆధారంగా విషయాధారిత వాదం కొత్త సమస్యలను పరిష్కరిస్తుంది. ఈ వాదాన్ని 1980లో రోజర్‌శాంక్, ఆయన శిష్యబృందం ప్రతిపాదించారు.

- అశోకరాణి వడ్లమూరి, ప్రభుత్వ ఉపాధ్యాయిని.

అలోవేరా డ్రింక్

స్వయం ఉపాధి



సామాజిక, ఆర్థిక అభివృద్ధితో ప్రజల అలవాట్లు, ప్రాధాన్యాలు మారడం సహజం. ఆరోగ్యంపై శ్రద్ధ ఫలితంగా శుచికరమైన ఆహారం, పానీయాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. అందువల్లనే మనందరం కలబందగా పిలిచే 'అలోవేరా' ఆరోగ్య, సౌందర్య పరిరక్షణ, ఇతర ఉత్పత్తులకు డిమాండ్ క్రమేణా పెరుగుతోంది. నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఉత్పత్తులు అందుబాటులో ఉంటే అవసరమైతే అధిక ధరలు చెల్లించి అయినా ఉపయోగించడానికి నేటి వినియోగదారులు వెనుకాడటం లేదు.

కలబంద ప్రయోజనాలు

శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపుతుంది, రోగనిరోధకశక్తిని వృద్ధి పరుస్తుంది. ఆల్కనైజింగ్ ప్రభావం వల్ల జీర్ణవ్యవస్థ వృద్ధి చెందుతుంది. అజీర్తి సమస్యను నివారిస్తుంది. మధుమేహాన్ని నియంత్రిస్తుంది. వడదెబ్బ, కాలిన గాయాలు పొడిచర్మం వల్ల సమస్యలను నివారిస్తుంది. నోటి సంబంధ వ్యాధులను నివారిస్తుంది. చర్మాన్ని ప్రకాశవంతం చేస్తుంది. పోషక విలువలను పెంచుతుంది. యాంటీ ఇన్‌ఫ్లమేటరీగా పనిచేస్తుంది. శరీర వృద్ధికి తోడ్పడుతుంది. అవసరమైన విటమిన్లను శరీరానికి అందిస్తుంది. క్యాన్సర్ రాకుండా నిరోధిస్తుంది. కాలేయాన్ని సమర్థంగా పనిచేయిస్తుంది.

అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉండటంతో అలోవేరా డ్రింక్‌ను ప్రతిరోజూ తీసుకుని ఆరోగ్యాన్ని వృద్ధి చేసుకోవచ్చు.

రెడీ టు డ్రింక్ / సర్వ్ జ్యూస్

సింథటిక్ శీతల పానీయాల్లో అధికశాతం పెస్టిసైడ్స్ ఉంటున్నాయని, అవి ఆరోగ్యానికి హానికరంగా మారుతున్నాయని అనేక స్వచ్ఛంధ సేవా సంస్థలు ఆధారాలతో సహా నిరూపిస్తున్నాయి. దాంతో ప్రజల్లోనూ వాటిపై వ్యతిరేకత వస్తున్నది. అందువల్ల నాణ్యమైన ముడి పదార్థాలతో రుచికరమైన రెడీ టు డ్రింక్ / సర్వ్ కలబంద పానీయం మంచి ప్రత్యామ్నాయ శీతల పానీయం అవుతోంది.

తయారీ విధానం

నాణ్యమైన అలోవేరా జ్యూస్‌ను సేకరించాలి. ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానం అనుసరించి దానిని రెడీ టు సర్వ్ అలోవేరా జ్యూస్‌గా తయారు చేయవచ్చు. ప్యూర్ కలబంద జ్యూస్‌తోపాటు మామిడి, స్ట్రాబెర్రీ, లిచీ, దానిమ్మ, ఇతర పండ్ల ఫ్లేవర్స్‌ను కూడా చేర్చవచ్చు. సహజ ఆహార రంగులు, ప్రిజర్వేటివ్స్‌లతో రుచికరమైన, ఆరోగ్యకరమైన అలోవేరా జ్యూస్ తయారుచేయవచ్చు. ఒకసారి తాగడానికి వీలుగా 250 మి.లీ. పరిమాణంలో బాటిలింగ్ చేయడంతోపాటు, ఇంట్లో ఫ్రిజ్‌లో ఉంచుకొని తాగడానికి వీలుగా ఒక లీటరు బాటిల్స్ కూడా ప్యాకింగ్ చేసి మార్కెట్‌కు పంపవచ్చు.

అవసరమైన యంత్రపరికరాలు

సుగర్ సిరప్ తయారీ యంత్రం, మిక్సింగ్ ట్యాంక్, పాశ్చరైజర్, బాటిలింగ్ యంత్రం, వర్కింగ్ టేబుల్స్, ఎస్ఎస్ పాత్రలు మొదలైనవి.

ముడి పదార్థాలు

ఫుడ్ గ్రేడ్, ఆర్గానిక్ అలోవేరా జ్యూస్ (ఫైబర్ లేకుండా, పల్స్‌ఫైబర్ కూడిన), నేచురల్ ఫ్రూట్ ఫ్లేవర్స్, కలర్స్, ప్రిజర్వేటివ్స్, బాటిల్స్, లేబుల్స్, కార్టూన్ బాక్సులు మొదలైనవి.

మార్కెట్ అవకాశాలు

నాణ్యమైన పద్ధతిలో తయారుచేసిన కలబంద జ్యూస్‌కు వినియోగదారుల ఆదరణ ఉంటుంది. పాన్‌షాపులు, కిరణా, సూపర్ మార్కెట్స్ ద్వారా వినియోగదారులకు అందుబాటులో ఉంచడం అవసరం. ఆన్‌లైన్ విధానంలో కూడా మార్కెటింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. నాణ్యమైన నూతన ఆహార ఉత్పత్తుల తయారీ పరిశ్రమ పై ఆసక్తి ఉన్న యువతకు రెడీ టు డ్రింక్ / సర్వ్ అలోవేరా జ్యూస్ పరిశ్రమ మంచి స్వయంఉపాధి అవుతుంది.



మైనంపాటి శ్రీనివాసరావు
బిజినెస్ కన్సల్టెంట్
సెల్: 9866119816

పరిశ్రమ వ్యయం

ఉత్పత్తి సామర్థ్యం: వెయ్యి లీటర్లు / రోజుకు
పరిశ్రమ వ్యయం: రూ.35 లక్షలు

SSC CGL TIER-II *MODEL PAPER*

(నిన్నటి స్టడీ తరువాయి)

ENGLISH LANGUAGE AND COMPREHENSION

